ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
జిల్లా వార్తలు
ఆదివారం 21, జూలై 2024

జిల్లాస్థాయి అధికారుల విషయంలో ఉమ్మడి నిర్ణయం

జిల్లాస్థాయి అధికారుల నియామకం విషయంలో ఉమ్మడి నిర్ణయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదాహరణకు విద్యుత్ శాఖ ఎస్ఈ పోస్టుతోపాటు మరో రెండు జిల్లాస్థాయి అధికారుల పోస్టులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ముందుగా సిఫార్సు లెటర్‌పై సంతకం చేసినట్లు చెప్పగానే మిగిలిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు కూడా సంతకాలు చేశారు. డ్వామా పీడీగా అదే సంస్థలో పనిచేస్తున్న రమేష్ అనే అధికారికి బాధ్యతలు ఇవ్వాలనే విషయంలో మాత్రం డైలమా నడుస్తోంది. విద్యుత్ శాఖ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లును నియమించాలని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే ప్రస్తుత ఎస్ఈ మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేస్తున్నందున అంతవరకు అవకాశం ఇద్దామని ఒక జిల్లా పార్టీ బాధ్యతలు చూస్తున్న హ్యాట్రిక్ ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో మన ఫోన్లు కూడా చాలామంది అధికారులు లిఫ్ట్ చేయకపోయినా ఈ ఎస్ఈ స్పందించారనే సానుభూతి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ప్రస్తుత ఎస్ఈని కొనసాగించడాన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా అనుకుంటున్న వెంకటేశ్వర్లుకు ఇంకా ఉద్యోగోన్నతి రానందున రాగానే అవకాశం ఇవ్వాలా? లేక ఇప్పుడే ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇవ్వాలా? అనే విషయంపై సమష్టిగా నిర్ణయం తీసుకునే ప్రయత్నంలో ఉన్నారు. డీపీవోగా గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రతిపాదించిన ఓ అధికారి పేరు పరిశీలనకు వచ్చింది. జడ్పీ సీఈవోగా సమర్థవంతుడైన అధికారిని నియమించాలన్న ఉద్దేశంతో అందరూ పరిశీలన చేస్తున్నారు. ఇలా జిల్లాస్థాయి అధికారుల విషయంలో కూడా ప్రతిపాదనకు వచ్చిన అధికారులపై క్షుణ్ణంగా సమాచారం సేకరించుకొని ఆ తర్వాతే నిర్ణయించుకుంటున్నారు.

- బదిలీల నుంచి సర్వం ఎమ్మెల్యేలకే అధికారం
- జిల్లాస్థాయి వ్యవహారాల్లో సమష్టి నిర్ణయాలు
- కలెక్టర్, ఎస్పీల విషయం ముందుగానే చెప్పిన లోకేష్
- విద్యుత్ ఎస్ఈ అంశంపై ప్రత్యేక సమీక్ష
- అందరి ఆమోదంతోనే జిల్లా అధికారుల నియామకాలు



ఒకటే మాట..!

- పవర్ వచ్చినా సంప్రదాయాన్ని వీడని టీడీపీ నేతలు
- ఇతరుల నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోని మంత్రులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో ప్రభుత్వం మారి నెలరోజులు గడిచింది. ఉన్నతస్థాయి బదిలీల పరంపర ఇప్పుడిప్పుడే ముగుస్తోంది. కలెక్టర్, ఎస్పీలాంటి అధికారుల మార్పు విషయంలో జిల్లా నేతల అభిప్రాయం తీసుకోకపోయినప్పటికీ వారి నియామకానికి ముందు అధిష్ఠానం సమాచారం ఇచ్చి సంతృప్తిపరిచింది. మంత్రులు రవికుమార్, స్వామికి లోకేష్ ముందుగా ఫోన్ చేసి కలెక్టర్, ఎస్పీల నియామకం గురించి సమాచారం ఇచ్చారు. ఎస్పీ నియామకం రోజు కూడా స్వామికి లోకేష్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'మీ అందరికీ సుపరిచితులు, మీ గురించి తెలిసిన పోలీసు అధికారి దామోదర్‌ను మీకు ఎస్పీగా పంపుతున్నాం. ఏమైనా సమస్యలుంటే సాయంత్రంలోపు తెలపండి' అని నేరుగా లోకేష్ స్వామికి తెలిపారు. అదేరకంగా బాపట్ల జిల్లా విషయంలో రవికుమార్‌తో మాట్లాడారు. అయితే కలెక్టర్, ఎస్పీల విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు.



కిందిస్థాయిలో బదిలీలు

కిందిస్థాయిలో నియోజకవర్గాల పరిధిలో అధికారులు, ఉద్యోగుల బదిలీ వ్యవహారాలను ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులే పర్యవేక్షిస్తున్నారు. ఇతర నియోజకవర్గాలకు సంబంధించి బదిలీ కోసం మంత్రుల వద్దకు ఎవరైన వెళితే 'ముందు ఆ ఎమ్మెల్యేను కలిసి రండి. ఆయన అంగీకరిస్తే మేం చెబుతాం' అని మంత్రులు స్పష్టం చేస్తున్నారు. ఆమేరకు బదిలీలపై ఎమ్మెల్యేలు దృష్టిసారించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో కీలకమైన మున్సిపల్ కమిషనర్ పోస్టుకు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అనే కొత్త అధికారిని నియమించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిర్ణయం తీసుకున్నారు. ఆర్డీవోగా గతంలో పనిచేసిన విశ్వేశ్వరరావుకు తిరిగి అవకాశం భావిస్తున్నారు. డీఎస్పీగా రాయపాటి శ్రీనివాసరావుకు, తాలూకా సీఐగా అజయ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిఫార్సు చేశారు. దళిత, బలహీన వర్గాలకు చెందిన ఇద్దరు సీఐలను వన్‌టౌన్, టూటౌన్‌లకు తీసుకోవాలని నిర్ణయించారు.

సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్‌ల నియామకంపై అవగాహన

జిల్లాలోని మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ల నియామకంపై ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చారు. ఆర్డీవో, డీఎస్పీల విషయంలో కలిసి నిర్ణయం తీసుకోవాలని భావించారు. కనిగిరి డీఎస్పీ విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మంత్రి స్వామి, కొండపి నాయకుడు దామచర్ల సత్య ఒక నిర్ణయానికి వచ్చారు. ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మార్కాపురం ఆర్డీవో, డీఎస్పీల విషయంపై సమష్టి నిర్ణయం తీసుకునేందుకు మాట్లాడుకుంటున్నారు. అలాగే చీరాల డీఎస్పీ, ఆర్డీవో విషయంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి, కొండయ్యలు ఒకే నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. మార్టూరు సీఐగా శేషగిరిరావును నియమించాలని ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సు చేశారు. దర్శి సీఐగా రామారావు పేరును దామచర్ల సూచించడంతో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఓకే చేశారు. మార్కాపురం సీఐగా సుబ్బారావుకు ఎమ్మెల్యే కందుల సిఫార్సు చేశారు. కంభం సీఐగా ప్రస్తుతం ఉన్నవారినే కొనసాగించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి భావిస్తున్నారు. కనిగిరి, పామూరు సీఐలుగా నాయక్, సుబ్బరాజుల పేర్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరిశీలిస్తున్నారు. కనిగిరి డీఎస్పీగా రెడ్డి సామాజికవర్గం వారే కావాలని డాక్టర్ ఉగ్ర, మంత్రి స్వామి, సత్య నిర్ణయించుకొని అధిష్ఠానంకు తెలిపారు.

ప్రతిపక్షంలో ఉండగా ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగారు. ఒంగోలులో మహానాడును నిర్వహించడమే సాహసమైతే దిగ్విజయం చేసి అందరి మన్ననలు పొందారు. ఎక్కడ ఎవరికి సమస్య వచ్చినా కలసికట్టుగా నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగారు. తద్వారా జిల్లా టీడీపీ నాయకత్వం ఆదర్శంగా పనిచేస్తున్నదని ఆపార్టీ అధినేత చంద్రబాబు పదేపదే కితాబిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదేతరహాలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ముందడుగు వేస్తున్నారు. అప్పటి వారిలో ఇద్దరు మంత్రులయ్యారు. ఒకరు మినహా మిగిలిన వారంతా ఎమ్మెల్యేలయ్యారు. అయినా ఐక్యత చెక్కు చెదరలేదు. వివాదాస్పద అంశాలపై ఒకటికి రెండుసార్లు సమీక్షించుకొని ఒక్కమాటపై సాగుతున్నారు. కలెక్టర్, ఎస్పీల నియామకంపై ముందుగానే అధిష్ఠానం జిల్లాకు చెందిన మంత్రులకు సమాచారమిచ్చింది. అధికారుల బదిలీ విషయానికి వస్తే ఏ నియోజకవర్గ పరిధిలోని అంశాన్ని అక్కడి ఎమ్మెల్యే, ఇన్‌చార్జులే చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. మేం జోక్యం చేసుకోమని మంత్రులు తేల్చిచెప్పారు. జిల్లాస్థాయి అధికారుల విషయంలో అందరి ఆమోదంతో జాబితా తయారుచేసి తదనుగుణంగా నియమించుకోవాలన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదనకు మిగిలిన వారు జైకొట్టారు.

చీమకుర్తి సీఐ విషయంలో...

చీమకుర్తి సీఐగా సుబ్బారావు నియామకంపై అధిష్ఠానం నేరుగా నిర్ణయం తీసుకోవడంపై అందరిలోనూ ఆందోళన కనిపించింది. పోలీసు శాఖలో వైసీపీ ప్రభుత్వం పోస్టింగ్ కూడా ఇవ్వకుండా దూరంగా పెట్టిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక నేతలు భావించారు, అందుకు విరుద్ధంగా చీమకుర్తి సీఐ నియామకం జరిగింది. అయితే అధిష్ఠానం నుంచి పూర్తి సమాచారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ముందుగానే రావడంతో ఆయన సంతృప్తిచెందారు. ఇదేసమయంలో ప్రధానంగా డీఎస్పీలు, ఆర్డీవోల లాంటి అధికారుల నియామకం విషయాన్ని అధిష్ఠానం ప్రత్యేకంగా పరిశీలిస్తుందన్న సమాచారాన్ని ఎమ్మెల్యేలకు ఇచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా లోకేష్ రూపొందించిన రెడ్‌బుక్‌లో ఉన్న వైసీపీ అనుకూల అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వాలనుకుంటే పైన బ్రేక్ పడుతుందనే సంకేతం ఇచ్చారు. అందుకు మంత్రి స్వామిని నానా ఇబ్బందులు పెట్టిన మాతంగి శ్రీనివాసులు అనే సీఐ తుళ్లూరు సర్కిల్ పోస్టింగ్‌కు సిఫార్సు చేయించుకుంటే అధిష్ఠానం వీఆర్‌కు పంపడమే నిదర్శనం. గత ప్రభుత్వంలో మంచి పోస్టుల్లో పనిచేసినప్పటికీ ఇప్పుడు వారిని తిరిగి తీసుకోవాలంటే తగిన కారణాలు చూపాలని లోకేష్ ఆఫీస్ నుంచి సమాచారమిచ్చినట్లు తెలిసింది. దీంతో జిల్లాలోని మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు అధిష్ఠానం సూచనకు అనుగుణంగా జిల్లాస్థాయి అధికారుల విషయంలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని, నియోజకవర్గాల పరిధిలోని అధికారుల బదిలీ విషయాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకొన్నారు. ఈ సమష్టి పోకడను అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు మంత్రి లోకేష్ కూడా అభినందిస్తున్నట్లు తెలుస్తోంది.

వేట మొదలైంది!

- బాధితుల ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ దామోదర్
- ఆగమేఘాలపై కదిలిన పోలీసులు
- బాలికను వేధిస్తున్న ఆకతాయిపై కేసు, రౌడీషీట్
- గంటల వ్యవధిలోనే అదుపులోకి నిందితుడు

ఒంగోలు (క్రైం), జూలై 20 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ రంగంలోకి దిగిపోయారు. బాధితులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని నిరూపించారు. శుక్రవారం ఒంగోలులోని మహిళా పోలీసు స్టేషన్ తనిఖీకి వెళ్లిన ఎస్పీ దామోదర్‌కు ఓ మహిళ తన కుటుంబం పడ్డ వేదనను విన్నవించారు. వెంటనే ఆయన స్పందించి ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. తక్షణ చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేయలన్నారు. దీంతో పోలీసులు ఆగమేఘాలపై కేసు నమోదు చేయడమే కాకుండా నిందితుడిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది.



ఒంగోలులోని మహిళా పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

వివరాల్లోకి వెళితే.. నగరంలో వారం క్రితం తన పెంపుడుకుక్కను బయట తిప్పడానికి తీసుకొచ్చిన పదేళ్ల బాలికపై ఆకతాయి అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు యువకుడి వెంటపడ్డారు. కొద్దిదూరం పరుగు తీసిన అతడు దగ్గరలో ఉన్న తన స్నేహితుడి ఇంటిలోకి వెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఆ ఇంటి తలుపుతట్టి యువకుడి గురించి వాకబు చేశారు. అయితే అతడి స్నేహితుడు బయటకొచ్చి దుర్భాషలాడుతూ బాలిక తండ్రిపై చేయిచేసుకున్నాడు. దీంతో విషయం ఎవరికి చెప్పుకోలేక వారు కుమిలిపోతున్నారు. శుక్రవారం మహిళా పోలీసుస్టేషన్ తనిఖీకి ఎస్పీ వచ్చారని తెలుసుకున్న బాలిక తల్లి వెళ్లి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎస్పీ.. ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. స్థానిక వంటవారి కాలనీకి చెందిన మిట్టల అనిల్‌గా తేల్చి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. గతంలో చైన్‌స్నాచింగ్ కేసు కూడా అనిల్‌పై ఉంది. దీంతో ఆయనపై రౌడీషీట్ తెరిచారు.

మహిళలు, చిన్నపిల్లల జోలికొస్తే ఉపేక్షించం : ఎస్పీ

మహిళలు, చిన్నపిల్లలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వారి జోలికొచ్చినా ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్. దామోదర్ హెచ్చరించారు. అలాంటివారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాలికల భద్రతపై దృష్టిపెడతామన్నారు. బాధితులు డయల్ 100 ద్వారా సమాచారం పోలీసులకు తెలియజేయవచ్చన్నారు.


జిల్లా సరిహద్దు 85/3 వద్ద ప్రవహిస్తున్న సాగర్ జలాలు

జిల్లాకు చేరిన సాగర్ జలాలు

- ఎస్ఎస్ ట్యాంకులు నింపేందుకే ప్రాధాన్యం

త్రిపురాంతకం, జూలై 20 : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు జిల్లాకు చేరాయి. జిల్లా సరిహద్దు 85/3 హెడ్ రెగ్యులేటర్ వద్ద శనివారం సాయంత్రానికి 6 అడుగుల లోతులో 1,402 క్యూసెక్కుల నీరు పవహిస్తోంది. డీఈఈ విజయలక్ష్మి, ఏఈఈలు శివన్నారాయణ, నీలిమ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన ఈ జలాలతో రామతీర్థం రిజర్వాయర్‌తోపాటు అన్ని ఎస్ఎస్ ట్యాంకులు నింపుకునే అవకాశం ఉందన్నారు. నీటి చౌర్యం జరగకుండా ఎన్నెస్పీ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బందితో పర్యవేక్షిస్తామన్నారు. కుడి కాలువకు 4.5 టీఎంసీల నీటిని కేటాయించారని చెప్పారు. 85/3 వద్ద 1.5 నుంచి 2 టీఎంసీల నీరు జిల్లాలోకి రావచ్చని తెలిపారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు బదిలీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: సాధారణ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు పంపుతూ భూపరిపాలన ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) ఉత్తర్వులు జారీచేశారు. ఒకేస్థానంలో మూడేళ్లకుపైగా పనిచేస్తున్న వారిని, సొంత జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని మూడో జోన్ పరిధిలోని ఇతర జిల్లాలకు అప్పట్లో బదిలీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగియడంతో బదిలీ అయిన తహసీల్దార్లందరినీ తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని ఎన్నికల ముఖ్యఅధికారి (సీఈవో) ఆదేశించారు. వీరందరూ కలెక్టర్ ద్వారా పునర్ నియామక ఉత్తర్వులు పొందాల్సి ఉంది. తహసీల్దార్లను వారి సొంత రెవెన్యూ డివిజన్ పరిధిలో నియమించరాదని సీసీఎల్ఏ కలెక్టర్లను ఆదేశించారు. ఈ విషయంలో ఎవరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోకుండా ఇతర డివిజన్లకే వారిని నియమించాలని సూచించారు.

రూ.2కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ

- 70 సెంట్లు అన్యాక్రాంతమైనట్లు గుర్తింపు
- కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లూరు, జూలై 20: మండలంలోని బెల్లంకొండవారిపాలెం సమీపంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. 'రూ.2 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ' శీర్షికన ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. తూర్పుగంగవరం-దర్శి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో బెల్లంకొండవారిపాలెం సమీపాన గల సర్వే నంబర్ 85లోని రెండు ఎకరాల ఆర్అండ్‌బీ భూమిలో 50 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన సర్వే నంబర్ 64/4లో 0.20 సెంట్ల స్థలం ఆక్రమించినట్లు గుర్తించారు. రెండు శాఖలకు చెందిన మొత్తం 0.70 సెంట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు తేల్చారు. ఈమేరకు నివేదికను తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు అందజేశారు.

రాయితీపై నిత్యావసరాలు

- రేషన్ షాపుల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు
- తొలి విడత నాలుగు రకాల సరుకులు
- తక్కువ ధరకే కందిపప్పు
- వచ్చేనెల నుంచి పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: రేషన్ కార్డుదారులకు రాయితీపై నిత్యావసర సరుకులు అందించేందుకు చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం ఏడాది కాలంగా రాయితీపై కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం విస్మరించింది. అప్పుడప్పుడూ చక్కెర ఇస్తూ కేవలం బియ్యంకే పరిమితమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలపై ప్రత్యేక దృష్టిసారించారు. బహిరంగ మార్కెట్లో అధిక ధరలను దృష్టిలో పెట్టుకొని రేషన్‌షాపుల ద్వారా పలురకాల సరుకులు ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చేనెల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభంకానుంది. బియ్యంతోపాటు రాయితీపై కందిపప్పు, చక్కెర, గోధుమపిండిని ఇవ్వనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రంలో టెండర్లు పూర్తయ్యాయి. కందిపప్పు, గోధుమపిండి, పంచదార పౌరసరఫరాల గిడ్డంగులకు పంపుతున్నట్లు సమాచారం. ప్రధానంగా బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.180 వరకు ఉండటంతో పేదలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు కిలో రూ.67కే ఇవ్వనున్నారు. ఆగస్టు నుంచి మూడు నెలలకు సరిపడా కందిపప్పు, చక్కెర, గోధుమపిండి కార్డుదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు కార్డుదారులకు రాగిపిండి సరఫరా అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌షాపుల ద్వారా రాగులు, జొన్నలు రాయితీపై పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని నిలిపివేసింది. తిరిగి చంద్రబాబు సర్కారు అధికారంలోకి రావడంతో వాటి పంపిణీకి కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.




ఒంగోలు డెయిరీలో యంత్రాలను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

వైసీపీలా చేయొద్దు

- గత ప్రభుత్వ హయాంలో అన్నీ అప్పులే
- సహకార డెయిరీని పునరుద్ధరించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20 : గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా రాష్ట్ర ప్రజల కోసం ప్రస్తుత ప్రభుత్వం పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం, ప్రభుత్వ భూములు, వాణిజ్య సంస్థలపై జగన్ వేలకోట్లు అప్పులు చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతినెలా 1న ఉద్యోగులకు జీతాలు, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలంటే అప్పు చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్నదని మండిపడ్డారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నదని ఆరోపించారు. దీనిని గుర్తించిన ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో ఆపార్టీకి 62 సీట్లు కోతపెట్టారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, నితీష్‌కుమార్ ఎన్‌డీఏ కూటమిలో కలవకపోతే దేశ రాజకీయాలు మరోలా ఉండేవన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కేవలం అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డికి భయపడే ఎన్‌డీఏలో చేరారన్నారు. మోదీ ఇప్పటికే దేశసంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారని ఆరోపించారు. పేదలకు అండగా ఉండేది కమ్యూనిస్టు పార్టీలేనని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభావం తగ్గుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇండియా కూటమి సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఫలితాలు మరోరకంగా ఉండేవని ఆయన పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయడంతోపాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.వెంకట్రావు, అందె నారసయ్య, సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్‌చౌదరి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే పాలకేంద్రాన్ని నిర్వహించాలి

వైసీపీ ప్రభుత్వంలో అమూల్ సంస్థకు ఒంగోలు పాలకేంద్రాన్ని ఇచ్చిందని, దానిని వెంటనే రద్దు చేసి ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని రామకృష్ణ కోరారు. శనివారం మధ్యాహ్నం పాలకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రకాశం జిల్లా పాడిరైతులకు ఉపయుక్తంగా ఉండే సహకార డెయిరీని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జిల్లాలోని లక్షలాది మంది ఆ డెయిరీపై ఆధారపడి ఉన్నారన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి డెయిరీ గురించి వివరిస్తామని రామకృష్ణ తెలిపారు. ఆయన వెంట నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, ఎంఎల్ నారాయణ, వెంకట్రావు, పీవీఆర్ చౌదరి ఉన్నారు.

గురువే దైవం.. గురువే సర్వం..!

గురువును పూజిస్తే త్రిమూర్తులను కొలిచినట్లే..
వేదవ్యాసుడు జన్మించిన రోజు
నేడు గురుపూర్ణిమ
పలు ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ఒంగోలు(కల్చరల్), జూలై 20: 'గురుఃబ్రహ్మ, గురుఃవిష్ణు, గురుదేవో మహేశ్వరః' అంటూ మన పెద్దలు గురువు విశిష్టతను చెప్పారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తి స్వరూపమే గురువు అని, అటువంటి గురువును పూజిస్తే త్రిమూర్తులను పూజించిన ఫలితం దక్కుతుందనేది వేదవాక్యం. అందుకే హిందూధర్మంలో గురువుకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ధర్మశాస్త్రాల ప్రకారం 'వ్యాసమహర్షి'ని గురువుగా భావిస్తారు. అందుకే ఆయన ఆవిర్భవించిన జన్మతిథి ఆషాఢపౌర్ణమిని 'గురుపౌర్ణమి'గా జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. అంతేగాకుండా గురుపౌర్ణమినే వ్యాసపౌర్ణమిగా కూడా పిలుస్తారు. ఇక సాక్షాత్తు ఆ పరమశివుడే వ్యాసుని రూపంలో ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. కనుక వ్యాసపౌర్ణమి రోజున గురువును పూజిస్తే పరమేశ్వరుని పూజించిన ఫలితం దక్కి మంచి జ్ఞానం కలుగుతుంది. గురువు అన్న మాటకు అజ్ఞానాన్ని పారద్రోలేవాడనీ, అధికుడనీ ఎన్నో అర్థాలు ఉన్నప్పటికీ, గురువు మనలోని అజ్ఞానాన్ని నశింపజేసి జ్ఞానమనే వెలుగును నింపుతాడని సర్వజనీనంగా ఉండే నమ్మకం. అటువంటి గురుపరంపరలో ముందుగా వేదవ్యాసుడు, దక్షిణామూర్తి గురించి చెబుతారు.

చాతుర్మాస్య దీక్షకు ఇదే సమయం

ఇక ప్రస్తుతం మనకు సమాజంలో ఎంతో మంది గురువులు ఉన్నారు. చదువు నేర్పిన వారిదగ్గర నుంచి మంత్రోపదేశం చేసిన వారు, ఆధ్యాత్మిక తత్వాన్ని బోధించేవారు, పీఠాధిపతులు, మఠాధిపతులు, యోగీశ్వరులు ఇలా అనేకమందిని గురువులుగా పూజిస్తారు. వీరిలో ఎక్కువగా పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు గురుపౌర్ణమి మొదలు నాలుగునెలల పాటు చాతుర్మాస్యదీక్షను చేపడతారు. ఈకాలంలో వారు ఎక్కడికీ కదలకుండా ఒకే చోట ఉంటూ, ఆహార నియమాలను పాటిస్తూ ఎంతో నిష్ఠగా జీవిస్తారు. అదేవిధంగా బుద్ధునికి జ్ఞానోదయం అయిన తర్వాత తొలి బోధనను గురుపౌర్ణమి రోజునే చేశారు. ఆర్యసూత్రాలను తన శిష్యులకు అందించారు.

గురుస్వరూపులకు ప్రత్యేక పూజలు

ప్రస్తుతం చాలామంది గురుపౌర్ణమి అనగానే అది షిరిడి సాయిబాబా పుట్టినరోజుగా భావిస్తున్నారు. 1906వ సంవత్సరంలో ఆషాఢపౌర్ణమి సందర్భంగా సాయిబాబా గురువుగా అవతరించిన రోజు. మీరంతా తనను దేవునిగా అనుకుంటున్నారని, కానీ తాను దేవుని సేవకుడిని, భక్తులను సక్రమమైన మార్గంలో నడిపేందుకే వచ్చినట్లు తెలియజేస్తాడు. ఆ రోజు మొదలు గురుపౌర్ణమి రోజున నుంచే ఆయనను పూజించటం ప్రారంభమైంది. అలాగే సత్యసాయిబాబా, భగవాన్ వెంకయ్యస్వామి, అచలానందస్వామి ఇలా అనేకమందిని వేలాదిమంది భక్తులు గురుస్వరూపులుగా భావించి పూజిస్తున్నారు.

వేడుకలకు ఏర్పాట్లు

గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించేందుకు పలు దేవస్థానాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరం సంతపేట సాయిబాబా మందిరం, లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అటు శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగమూరురోడ్ శ్రీసత్యసాయి మందిరంలో సైతం వేడుకలు జరుగనున్నాయి. ఇక సంతపేట భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో, మంగమూరు రోడ్‌లోని అచలానంద ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


వేదవ్యాస మహర్షి

అవీ..ఇవీ..

నందిపాడు హెల్త్‌సెంటర్‌పై జగన్ బొమ్మ

• పట్టించుకోని అధికారులు

మద్దిపాడు, జూలై 20: టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువై నెల రోజులు దాటినా అధికారుల తీరులో మార్పులేదు. మండలంలోని నందిపాడులో గల హెల్త్ సెంటర్‌పై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బొమ్మను అధికారులు ఇంకా తొలగించలేదు. దీన్ని చూసి గ్రామస్థులు తప్పుపడుతున్నారు. నిత్యం మండల అధికారులు, వైద్యులు హెల్త్‌సెంటర్‌కు వచ్చి వెళ్తున్నారే తప్ప జగన్ చిత్రాన్ని తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


భవనంపై ఉన్న జగన్ బొమ్మ

ప్రపంచ కమ్మ మహాసభలో జిల్లా ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), జూలై 20: హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం ప్రపంచ కమ్మ మహాసభను కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కమ్మవారి పట్టుదల, సమాజానికి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. హైదరాబాద్‌లో ఐదెకరాల స్థలంలో కమ్మ సంఘ భవన నిర్మాణం ప్రభుత్వం తరపున చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నుంచి కమ్మసంఘ ప్రతినిధులు రావుల పద్మజ, చిడిపోతు వెంకటేశ్వర్లు, పావులూరి బాపయ్యచౌదరి, బత్తిన తిరుపతిస్వామి, బొద్దులూరి ఆంజనేయులు, అంజలి శ్రీనివాస్, కాట్రగడ్డ రఘు, కంచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న జిల్లాకు చెందిన ప్రతినిధులు

జిల్లాలో 7.5 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20 : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 7.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొమరోలు మండలంలో 41.2, మార్కాపురం 27.4, గిద్దలూరు 16.4, తర్లుపాడు 15.4, రాచర్ల 13.4, కొండపని 11.8, చీమకుర్తి 11.0, పెద్దారవీడు మండలంలో 10.6 మి.మీ వర్షం పడింది. మిగిలిన మండలాల్లో జల్లులు పడ్డాయి.

మాగుంటను కలిసిన రైల్వే అధికారి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని రైల్వే గతిశక్తి అధికారి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలోని మాగుంట కార్యాలయంలో శ్రీనివాస్ కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా టంగుటూరు, సూరారెడ్డిపాలెం, కరవది, అగ్రహారంగేట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. రైల్వేస్టేషన్లలో ఆధునికీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు.


ఎంపీ మాగుంటకు బొకే ఇస్తున్న శ్రీనివాస్

మోటార్‌సైక్లిస్టు ఆకస్మిక మృతి

ఒంగోలు(క్రైం), జూలై 20: మోటార్‌సైక్లిస్టు ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన ఒంగోలు శివారు ప్రాంతం త్రోవగుంటలో శనివారం జరిగింది. వివరాలలోకి వెళితే.. నగరంలోని రామయ్యనగర్‌కు చెందిన మాకినేని అనిల్ కుమార్(45) ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో అనిల్ మోటార్‌సైకిల్‌పై ఒంగోలు నుంచి ఏడుగుండ్లపాడు వెళుతూ త్రోవగుంట వచ్చేసరికి ఆయన వాహనంపై నుంచి ఒక్కసారిగా కిందపడి మరణించాడు. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు అనిల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పుగుండూరు హైస్కూలు తనిఖీ

నాగులుప్పలపాడు, జూలై 20: ఉప్పుగుండూరులోని జడ్పీ హైస్కూలును శనివారం డీఈవో డి.సుభద్ర ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య, హెచ్ఎం పుట్టా చలపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో సుభద్ర

ఆరోగ్యవిద్యపై అవగాహన

సంతనూతలపాడు, జూలై 20: మైనంపాడు డైట్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఆరోగ్యవిద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. దీనివల్ల జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యాలు మనచేతిలోనే ఉంటాయన్నారు. గైనకాలజిస్టు భారతి మాట్లాడుతూ విద్యారులు సరైన ఆహారనియామాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

షట్టర్ పగులకొట్టి చోరీ

ఒంగోలు(క్రైం), జూలై20: ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్‌లో గల దొడ్ల డెయిరీ దుకాణం షట్టర్ పగుల కొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. షట్టర్ పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు కౌంటర్ డస్క్‌లో ఉన్న రూ.52వేలు నగదును అపహరించుకుని వెళ్ళారు. ఈ మేరకు దుకాణం యజమాని బొలినేని రవి ఫిర్యాదు మేరు టూటౌన్ సీఐ జగదీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐజీని కలిసిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), జూలై 20: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ ఏఆర్.దామోదర్ శనివారం పలువురు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, లాఅండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్.శ్రీకాంత్‌లను కలిసి బొకేలను అందజేశారు.

కౌలు రైతు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, జూలై 20: ఖరీఫ్ సీజన్లో కౌలు రైతు కార్డులను అందజేస్తామని ఏవో జి.రమేష్‌బాబు తెలిపారు. శనివారం మండలంలోని అన్నంగి, వెల్లంపల్లి, రాచవారిపాలెం, కీర్తిపాడు గ్రామాల్లో ఆయన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌలు రైతు కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్డులు 11 నెలలపాటు పని చేస్తాయని చెప్పారు. వీటివల్ల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్, సబ్సిడీ విత్తనాలు పొందటానికి కౌలురైతులు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటశేషారావు, బాలసుబ్రహ్మణ్యం, షాహినా, వీఆర్వో తేళ్ల బుల్లయ్య, వెల్లంపల్లి వీఆర్వో అరుణ, రైతులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో

నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(విద్య), జూలై 20: ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సెప్టెంబరు 16లోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సి.శివరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు, చీరాల, కందుకూరు అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాలకు చెందిన ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థి 5వ తరగతి చదువుతున్న పాఠశాల హెచ్ఎంతో ధృవీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 2013 మే 1నుంచి జూలై 31లోపు పుట్టిన వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. 2025 జనవరి 18న ఉదయం 11.15 నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

జిల్లాలోని సమస్యలను పరిష్కరించాలి

• సీఎం చంద్రబాబుకు మాగుంట వినతి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శనివారం విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి ఈమేరకు సమస్యలను ఆయన వివరించారు. ఉపాధి హామీ నిధులు, అలాగే ఎంపీ, పంచాయతీ, శాసనసభ్యుల తదితర నిధులతో కలిసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణానికి, ఆర్‌అండ్‌బీ రోడ్లను జాతీయ రహదారులుగా మార్చడం, సింగరాయకొండ వద్ద అత్యవసర విమాన ల్యాండింగ్ పనులు పూర్తి, అలాగే రాచర్ల, దర్శి కొండపిలలో కేంద్రీయ విద్యాలయాలు, కంభంలో నవోదయ విద్యాలయం మంజూరుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తితో పాటు మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాగుంట కోరారు. ఇక కనిగిరిలో ట్రిపుల్‌ఐటీ కాలేజీ మంజూరు, పిసిపల్లిలో తయారీ జోన్ ఏర్పాటుకు రూ.18859కోట్లు మంజూరు, ఒంగోలు నగరానికి అండర్ గ్రౌండ్ వాటర్ సిస్టం, శిల్పారామం, పెద్ద స్టేడియం మంజూరుతో పాటు జిల్లాలో జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని ఎంపీ మాగుంట తెలిపారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు సత్కారం


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు, జూలై 20: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను శనివారం మండల వ్యవసాయ అధికారి పి.పావని ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులోని బీఎన్ నివాసంలో వారు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట ఎరువులైన జనుములు, జీలుగలు కావాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళ అనుమానాస్పద మృతి

• ఇంటి వద్ద పూడ్చి వేసిన భర్త

ఒంగోలు(క్రైం), జూలై 20: మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. ఈ సంఘటన ఒంగోలు మండలం చింతాయిగారిపాలెంలో శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. చేపల చెరువుల వద్ద కాపల ఉండే బాపట్ల జిల్లా చీరాల మండలం రోశయ్య కాలనీకి చెందిన చల్లయ్యకు, అదేకాలనీకి చెందిన చెంచమ్మకు ఏడాది క్రితం వివాహం అయింది. చెంచమ్మకు గతంలో వేరే వ్యక్తితో వివాహం కాగా ఆమె భర్తకు దూరంగా ఉంటుంది. చెల్లయ్య కూడ వివాహమై భార్యకు దూరంగా ఉంటున్నాడు. దీంతో వీరు ఇరువురు ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నారు. అనంతరం చింతాయిగారిపాలెం చెరువుల వద్ద కాపలా నిమిత్తం వచ్చి నివాసం ఉంటున్నారు. అయితే వీరు తరచూ గొడవలు పడుతు ఉండే వారు ఈక్రమంలో మూడు రోజుల క్రితం ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో చెంచమ్మ ఇంట్లో ఉన్న కొంగలకు వేసే మందు తిని మృతి చెందింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన భర్త చెల్లయ్య ఇంటి వద్దనే గొయ్యి తవ్వి అక్కడే భార్య మృతదేహాన్ని పూడ్చి వేశాడు. ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఒంగోలు తాలుకా ఇన్‌చార్జి సీఐ ఖాజావలి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పూడ్చి వేసిన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బయటకు తీయాల్సి ఉందని, అందుకోసం డాక్టర్ల బృందం కోసం రిమ్స్‌కు లేఖ రాశామని తెలిపారు. వైద్యబృందంతో పోస్టుమార్టం చేయించి అనంతరం చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

పేలప్రోలు ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు (కల్చరల్), జూలై 20: ఒంగోలు లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో శనివారం పేలప్రోలు ట్రస్ట్ ఆధ్వర్యంలో మారెళ్ల కాశీరత్తమ్మ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాశీరత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేలప్రోలు ట్రస్ట్ నిర్వాహకులు పేలప్రోలు రామకృష్ణ పరమహంస (బిర్లా) మాట్లాడుతూ నగరంలో అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రస్తుతం విశేషమైన సేవలు అందిస్తున్నాయని అభినందించారు. నగరంలోని సేవా కార్యక్రమాలు చేస్తున్న శివం ఫౌండేషన్, సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్, బొమ్మరిల్లు అనాథ ఆశ్రమం, ఉషోదయ వృద్ధాశ్రం నిర్వాహకులను సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు. పేలప్రోలు ట్రస్ట్ సహకారంతో దివ్యాంగ విద్యార్థుల ఫీజులకు రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం పలు చోట్ల పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కాశీరత్తమ్మపై దశరథ రాసిన ప్రత్యేక గీతాన్ని గాయకుడు శరత్‌బాబు పాడగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు, టి.అరుణ, మండవ లావణ్య, టి.అనంతమ్మ, నామినేని మోహనరావు, యక్కల తులసీరావు, మంచినేని శ్రీనివాసరావు, బత్తుల మునలారెడ్డి, మారెళ్ల వివేకానంద, మారెళ్ల సుబ్బారావు, కొండూరి విశ్వసేన్, కొల్లా మధు, కొమ్మి రమణయ్య, రాజేశ్వరి, పేలప్రోలు చిలకమ్మ, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

కారుమంచి మేజర్ పరిశీలన


మేజర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చీమకుర్తి, జూలై20 : కారుమంచి మేజర్ కాలువను ఇరిగేషన్, మైనింగ్ అధికారులు శనివారం రైతు సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్రమ క్వారీయింగ్ వల్ల చీమకుర్తి శివారు వద్ద ఉన్న కారుమంచి మేజర్ కాలువ పక్కనే ఉన్న క్వారీలోకి కుప్పకూలిపోయింది. ఈ ఘటన జరిగి మూడేళ్లు కావస్తున్నా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవటంపై రైతుసంఘ నాయకులు పమిడి వెంకట్రావు ఆధ్వర్యంలో ఇటీవల నిరసన ప్రదర్శన చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దెబ్బతిన్న ప్రాంతాన్ని, పక్కనే ఉన్న క్వారీలను పరిశీలించారు. భవిష్యత్‌లో కాలువ దెబ్బతినకుండా రివిట్‌మెంట్ చేయాలని పమిడి వెంకట్రావు కోరారు. కాలువ మరమ్మతులకు అంచనాపై నివేదిస్తామని ఎన్ఎస్‌పీ ఇంజనీర్ రమణారెడ్డి, మైన్స్ డీడీ జగన్నాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజవాడ శ్రీనివాసరావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, మాదాల నరసింహరావు, నల్లూరి బ్రహ్మయ్య, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

నగరంలో కిలాడీ లేడి హల్‌చల్ !

• మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు
• ఆటోల్లో మాట కలుపుతూ ప్రయాణం
• హ్యాండ్‌బ్యాగులను కట్ చేయడంలో నేర్పరి
• వాపోతున్న బాధితులు

ఒంగోలు(క్రైం), జూలై 20: ఒంగోలు నగరంలో గత నెల రోజులుగా ఓ కిలాడీ లేడి హల్‌చల్ చేస్తోంది. ఆటోలో ప్రయాణిస్తూ తనతో పాటు ఎక్కిన మహిళల హ్యాండ్‌బ్యాగులను కట్ చేసి అందులో నగదును తస్కరించడం పరిపాటిగా మారింది. దీంతో పలువురు బాధితులు వాపోతున్నారు. మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చేసుకొని మాటలు కలుపుతూ ఆమె చోరీలకు పాల్పడుతోంది. తెలిసిన వివరాల మేరకు.. చోరీలలో ఆరితేరిన ఓ మహిళ ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రి వద్ద ఆటోలలో ప్రయాణికురాలిగా ఎక్కి పోతురాజుకాలువ వద్దకు వచ్చి దిగి వెళ్లి పోతుంది. అయితే అదే ఆటోలో ప్రయాణించిన మహిళలు తమ గమ్యస్థానాల వద్ద దిగి బ్యాగులో నగదు లేక పోవడం చూసి బావురుమంటున్నారు. సుమారు నెల రోజులుగా ఈ కిలాడీ లేడి చోరీలకు పాల్పడుతున్నది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదులు అందినప్పటికీ అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో శనివారం ఉదయం పెదకొత్తపల్లికి చెందిన ఓ మహిళ వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగును కట్ చేసి అందులోని రూ.30 వేలు చోరీ చేసింది. ఇలా తరచుగా ఆ కిలాడీ లేడి అదేరూట్‌లో ఆటోలలో ప్రయాణం చేస్తూ మహిళా ప్రయాణికులను దోచుకుంటోంది. నగదు అపహరించిన తరువాత పోతురాజుకాలువ వద్ద దిగి వెళ్ళి పోతుందని పలువురు బాధితులు చెబుతున్నారు. నెల రోజుల వ్యవధిలో వరుసగా సుమారు ఈ విధంగా ఆరు చోరీలు జరిగినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ కిలాడీ లేడిపై దృష్టి సారించి ఆట కట్టించి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలి • కలెక్టర్ అన్సారియా ఆదేశం • పలు శాఖల అధికారులతో సమీక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: జిల్లాలో వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం సాయంత్రం డివిజనల్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఇటీవల తాను జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సమయంలో అపరిశుభ్రతను గుర్తించినట్లు చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లోనే ఇలా ఉంటే ఇక పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులపై జరుగుతున్న సర్వేలో ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, లక్ష్మానాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రహదారి పనులు వేగవంతం

జిల్లాలో ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆర్‌అండ్‌బీశాఖ ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్డు మరమ్మతు పనుల ప్రతిపాదనలను రూపొందించి నివేదించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎస్ఈ దేవానందం, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డీఈఈ అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు చేరువ చేయాలి

ప్రజలకు సేవలను అందించడంలో రెడ్ క్రాస్ సొసైటీ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం రెడ్‌క్రాస్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ఈత సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి, స్టెప్ సీఈవో లోకేశ్వరరావు, కోశాధికారి రాఘవయ్య, సభ్యులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో అన్నదానం చేపట్టడం హర్షణీయం

త్వరలో దర్శిలో డొక్కా సీతమ్మ క్యాంటీన్
జనసేన పార్టీ దర్శి నియోజవర్గ ఇన్‌చార్జి వెంకట్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో పేదల ఆకలి తీర్చేందుకు ముందుకు రావడం హర్షణీయమని ఆ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గరికపాటి వెంకట్ పేర్కొన్నారు. ఒంగోలులోని డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రానికి శనివారం వెంకట్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేదలకు గత మూడు రోజులుగా ఉచితంగా అన్నదానం చేస్తున్న జడా బాలనాగేంద్రయాదవ్‌ను అభినందించారు. ఒంగోలులో జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని దర్శి నియోజకవర్గంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్నదాన నిర్వాహకుడు, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు దోహదపడుతుందని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోలా ప్రభాకర్, శీలంశెట్టి చంద్రశేఖర్, జి శ్రీనివాసరావు, పి.కోటయ్య, కోటా సుధాకర్, బిట్రగుంట పవన్, పప్పుల పాపారావు తదితరులు పాల్గొన్నారు.


పేదలకు అన్నం వడ్డిస్తున్న వెంకట్


గద్దలగుంటలో గోతులయమంగా మారిన రోడ్డు


భాగ్యనగర్ మెయిన్‌రోడ్డు దుస్థితి


హౌసింగ్‌బోర్డులో రోడ్డు బురదమయం

వీడని ముసురు..!

మూడు రోజులుగా నగరంలో వర్షం
చిత్తడిగా మారిన రహదారులు
గోతుల్లో నిలిచిన వర్షపునీరు
ఇబ్బందిపడుతున్న ప్రజలు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 20 : మూడు రోజులుగా వీడని ముసురు, వదలని వానతో ఒంగోలు తడిసి ముద్దయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన జల్లులతో శనివారం నగరం అస్తవ్యస్తంగా మారింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురవగా, శనివారం కాస్తంత తెరపించినా ప్రజలకు కష్టాలు తప్పలేదు. లోతట్టు ప్రాంతాలు బురదమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరోవైపు కాలువల్లో పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో మురుగునీరుతోడు, వర్షపు నీరు కలిసి రోడ్లపైకి ప్రవహించాయి. అంతే కాకుండా జల్లుల వానకు భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానిక కర్నూలురోడ్డు నుంచి మంగమూరు వెళ్ళే రోడ్డు మార్గం మరింత అస్తవ్యస్తంగా మారింది. గడిచిన ఐదేళ్ళలో కనీస అభివృద్ధి జరగకపోవడంతో రోడ్లన్నీ గోతులమయం కాగా, వర్షపు నీరు నిలవడంతో కనీసం కాలినడక కూడా కష్టతరంగా మారింది. గత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో నగర ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది. స్థానిక బాపూజీమార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్యనగర్, మస్తాన్ దర్గా సెంటర్ ప్రాంతాల్లో నీరు నిలవడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. మూడు రోజుల నుంచి ముసురు వాతావరణంతో రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడింది.

లోతట్టు ప్రాంతాలు మరింత అధ్వానం

ఎడతెరిపి లేకుండా ముసురుతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వెంకటేశ్వరకాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణా మిలటరీకాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, ప్రగతికాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని నెల్లూరుబస్టాండ్, ఆర్టీసీఆవరణం, స్టేషన్‌రోడ్, పలు ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలు, ఇబ్బందులు పడ్డారు. జల్లులతో రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు చేపట్టే చిరు వ్యాపారులు, చెప్పులు కుట్టుకునేవారు, తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.


కమ్మపాలెంలో అధ్వానంగా ఉన్న రోడ్డు


రిమ్స్ వద్ద రోడ్డుపై పేరుకున్న మురుగు


పులివెంకటరెడ్డి కాలనీలో రోడ్డుపై ఉన్న నీరు

అధ్వానంగా సాగర్ కాలువలు

» ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
» వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం
» తాగునీటి వ్యవస్థ నిర్వీర్యం

దర్శి, జూలై 20: సాగర్ కాలువలు గత ఐదు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటి రంగం నిర్వీర్యమైంది. గత వైసీపీ పాలనలో కనీసం చిల్లచెట్లు కూడా తొలగించిన పాపానపోలేదు. వైసీపీ పాలకులు చేసిన పాపాలు రైతులకు శాపంగా మారాయి. సాగర్ ప్రధాన కాలువతోపాటు దర్శి బ్రాంచ్ కాలువ, ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలు అనేకచోట్ల దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల కట్టలు కోసుకుపోయి పూర్తిగా బలహీనపడ్డాయి. మరికొన్నిచోట్ల లైనింగ్ దెబ్బతింది. సాగర్ కాలువలో పూర్తిస్థాయిలో నీరు విడుదలయితే కట్టలు బలహీనపడిన చోట తెగిపోయే ప్రమాదం నెలకొంది. కాలువ కట్టలకు ఇరువైపులా అనేకచోట్ల చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. మేజర్లు, మైనర్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అనేక మేజర్లు, తూములు, డ్రాపులు పగిలిపోయి కాలువలు పూడిపోయి రూపురేఖలు కోల్పోయాయి.


పూర్తిగా కోసుకుపోయిన సాగర్ కాలువ కట్ట


దెబ్బతిన్న సాగర్ కాలువ కట్ట లైనింగ్


కాలువకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చిల్లచెట్లు


రూపురేఖలు కోల్పోయిన మైనర్ తూములు

గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్వహించిన మరమ్మతులు తప్ప వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేజర్లు, మైనర్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఈఏడాది కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈఏడాది సాగునీరు వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే, కాలువల పరిస్థితి అధ్వానంగా ఉండటంతో నీటి సరఫరా ఇబ్బందికరంగా మారే పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సాగర్ కాలువలకు అత్యవసర మరమ్మతులయినా చేస్తారని రైతులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 4.5 లక్షల సాగర్ ఆయకట్టు భూమి ఉంది. దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్‌లో 99వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గత ఐదేళ్లలో సాగునీరు సక్రమంగా అందిన దాఖలాలు లేవు. అధికశాతం ఆయకట్టు భూములు బీళ్లుగా మిగిలిపోయాయి. ఈఏడాదయినా సాగునీరు అందుతుందని, పుష్కలంగా పంటలు పండుతాయని అన్నదాతలు సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్నారు. కాలువల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిన అధికారులు

సాగర్ కాలువల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్ల వరుసగా ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈఏడాది కూడా ఆనవాయితీ ప్రకారం చిల్లచెట్లు తొలగించేందుకు, గండ్లు పూడ్చేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. దర్శి డివిజన్ పరిధిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.90 లక్షలు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు.


షూటింగ్ బాల్ జట్లకు ఎంపికైన బాలబాలికలు

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

జమ్ములపాలెం (టంగుటూరు), జూలై 20 :షూటింగ్ బాల్ జిల్లాస్థాయి బాలబాలికల జట్ల ఎంపికను మండలంలోని జమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేశారు. బాలబాలికల జట్లు వచ్చేనెల 10, 11 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. బాలుర జట్టుకు ఎంపికైన వారిలో సిహెచ్.అమర్‌నాథ్, రోహిత్, నితిన్ విన్నర్, చందు, అభినవ్‌బుద్ధ, రిషికేత్, పి.కృష్ణ, కె.గౌతమ్, రూబిన్, యు.భాస్కర్, లక్ష్మీకైలాష్, వెంకటభార్గవ్, హనుమాచారి, నోయల్ సుమిత్, వెంకటభార్గవ్ ఉన్నారు. బాలికల జట్టుకు మహిత, మనీషా, కీర్తన, నమిత, మణిదీప్తి, అక్షయ, విజయలక్ష్మి, చెంచులక్ష్మి, కాంచన, కల్యాణి, క్రాంతి, దీప్తి ఎంపికయ్యారు. షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.మురళి, జమ్ములపాలెం హైస్కూల్ పీడీ తుల్లిబిల్లి అశోక్‌బాబు పర్యవేక్షించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, అధికారులు

డయేరియాపై అవగాహన

సింగరాయకొండ, జూలై 20 :మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ హైస్కూల్‌లోని విద్యార్థులకు శనివారం జలజీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డయేరియా బారినపడకుండా ముందుస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పీహెచ్‌సీ వైద్యురాలు ఉజ్వల వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరేరామ్, ఈవోపీఆర్డీ సుధాకర్‌రావు, జేజేఎం డీసీ డి.రవి, వి.కేశవరావు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డయేరియాపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

‘ఉపాధి’లో రూ.42 లక్షలు దుర్వినియోగం

సామాజిక తనిఖీలో గుర్తింపు
ప్రజావేదిక పరిశీలన అనంతరం రూ.2.61 లక్షల రికవరీ

తాళ్లూరు, జూలై 20: ఉపాధి హామీ పథకం కింద 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో రూ.42 లక్షలు దుర్వినియోగమయ్యాయి. ఈమేరకు సామాజిక తనిఖీలో గుర్తించారు. ఇందుకు సంబంధించి శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో పీడీ అర్జునరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2023 నుంచి మార్చి2024 వరకు ఉపాధి పథకం కింద 839 పనులకు రూ.9 కోట్ల 12లక్షల 93వేల నిధులు ఖర్చు చేశారు. ఈ తనిఖీలో దాదాపు రూ.42 లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఆడిట్‌లో డీఆర్పీలు గుర్తించిన అవకతవకల్లో ప్రజావేదిక పరిశీలన అనంతరం రూ.2 లక్షల 61వేల నగదు రికవరీ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. ఎక్కువగా మస్టర్లలో దిద్దుబాటు, కొట్టివేతలు ఉన్నాయని, కూలీలు సంతకాలు పెట్టకుండానే బిల్లులు చెల్లింపులు జరిగాయని, నాటిన మొక్కలు చాలావరకు లేవని, గ్రామాల్లో జరిగిన పనుల వద్ద పనుల వివరాలు తెలిపే బోర్డులు లేవని సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు వెల్లడించారు.ప్రజావేదిక అనంతరం డ్వామా పీడీ అర్జునరావు మాట్లాడుతూ మండలంలో ఉపాధి కింద చేపట్టే పనుల నిర్వహణకు ఎర్రర్ రిజిస్టర్ వినియోగించక పోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. బాధ్యతగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో కె.యుగకీర్తి, జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, ఇన్‌చార్జ్ ఏపీడీ నిర్మలాదేవి పాల్గొన్నారు.


ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు



మాట్లాడుతున్న కేన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ నూకసాని సుబ్బారావు

కేన్సర్‌పై అవగాహన సదస్సు

జరుగుమల్లి (కొండపి), జూలై 20 : జరుగుమల్లి జడ్పీహైస్కూల్‌లో శనివారం కేన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రముఖ కేన్సర్ వైద్యుడు నూకసాని సుబ్బారావు పాల్గొని వ్యాధిపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కేన్సర్ అంటువ్యాధి కాదని అదుపులేని కణవిభజన వలన వస్తుందన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభమతుందన్నారు. మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం, క్రమబద్ధమైన జీవనశైలితో కేన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు లక్ష్మీబాయి, ప్రధానోపాధ్యాయుడు మర్రిబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరు చెరువులో శ్యామ్ మృతదేహం లభ్యం

టంగుటూరు, జూలై 20 :మండలంలోని వల్లూరు చెరువులో గల్లంతైన వాసేపల్లిపాడు యువకుడు బానల వెంకటేష్ అలియాస్ శ్యామ్ (22) మృతదేహాన్ని శనివారం బయటకు తీశారు. ఈత కోసం గురువారం మధ్యాహ్నం వల్లూరు చెరువులోని నీటి కుంటలో దిగిన వాసేపల్లిపాడుకు చెందిన నల్లమలపు నవీన్ (23), శ్యామ్ గల్లంతయ్యారు. ఇంటి నుంచి వెళ్లిన వీరిద్దరూ రాత్రికి కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. రాత్రంతా వారి కోసం ఎదురు చూశారు. శుక్రవారం టంగుటూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా లోకేషన్ గుర్తించారు. వల్లూరు చెరువు వద్ద చూపించడంతో అక్కడికి చేరుకున్నారు. చెరువు కుంట ఒడ్డున వారి మోటారు సైకిల్, దుస్తులు కనిపించాయి. దీంతో యువకులిద్దరూ అక్కడ ఈతకు దిగి ఉంటారన్న నిర్ధారణకు వచ్చారు. వెంటనే పోలీసులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి వారి సాయంతో చెరువులో ఉన్న కుంటలో గాలింపు చేపట్టారు. సాయంత్రానికి నవీన్ మృతదేహం కనిపించింది. దానిని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చీకటిపడటంతో గాలింపు చర్యలను నిలిపివేసిన వారు శనివారం ఉదయాన్నే తిరిగి కుంటలో వెతకడం ప్రారంభించారు. కొద్దిసేపటికే శ్యామ్ మృతదేహం బయటపడింది. సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావు పర్యవేక్షించారు. ఈ ఘటనతో వాసేపల్లిపాడులో విషాదం నెలకొంది.

రేపటి నుంచి పాకల రైల్వే గేటు మూసివేత

సింగరాయకొండ, జూలై 20 : సింగరాయకొండ, పాకల మధ్య ఉన్న రైల్వేగేట్‌ను అత్యవసర పనుల కారణంగా సోమవారం నుంచి ఈనెల 28 వరకూ మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వాహనదారులు ప్రత్యామ్నాయంగా రాకపోకలకు సోమరాజుపల్లి గేటును ఉపయోగించుకోవాలని సూచించారు.

బడికెలా రావాలి..?

● రాంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మొర

ఇంకొల్లు, జూలై 20 : సార్ మేము పాఠశాలకు ఎలా రావాలి.. చిన్నపాటి వర్షం పడితే రాలేకపోతున్నాం. రావాలంటే భయమేస్తుంది.. ఇదీ ఇంకొల్లులో కడవకుదురు కాలనీ సమీపంలోని రాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆవేదన. ఈ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద గుంతలు పడి చిన్నపాటి వానకే పిల్లలు బడికి పోలేని పరిస్థితి ఉంది. స్కూల్‌కు వెళ్లేందుకు మరో రోడ్డు ఉంటే అదేమో చిల్ల చెట్లతో మూసుకుపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి. మరో రోడ్డులో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులు పెరిగిన చిల్ల చెట్లతో అడ్డంకులు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్‌కు వేళ్లేందుకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి సమస్యను అధికారులు పట్టించుకొని ఆ చిన్నారులు ప్రశాంతంగా బడికి పోయేలా చర్యలు తీసుకోవాలి.


మరో రోడ్డులో చిల్లచెట్లతో ఉన్న దారి


స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి

చినుకు పడితే.. మినీ బైపాస్ బురదే..!

అద్దంకిటౌన్, జూలై 20 : ఈ బురద రోడ్డును చూసి ఇది ఏదో గ్రామంలోని, గ్రామాలకు వెళ్లే అడ్డ రోడ్డు అనుకుంటే పొరపాటే. అద్దంకి మున్సిపాలిటీలోని మినీ బైపాస్‌గా చెప్పుకునే కాలువ కట్ట రోడ్డు. చినుక పడితే ఆ రోడ్డు వరి నారు మడిని తలపిస్తుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయంలో ఆ రోడ్డుకు గ్రావెల్, కంకర వంటివి పోసి అభివృద్ధి చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ రోడ్డు అభివృద్ధిని గాలికొదిలేసింది. దీంతో గ్రావెల్, కంకర వంటివి లేకుండా కుంటలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చినుక పడితే ఆ రోడ్డు అంతా బురద మయంగా మారి కనీసం పాదచారులు కూడా నడిచేందుకు వీలు లేకుండా మారింది. ఇప్పటికైనా సంబంధిత మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టి మినీ బైపాస్‌గా పిలువడే ఈ కాలువ కట్ట రోడ్డును అభివృద్ధి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


బురద మయంగా అద్దంకిలోని కాలువ కట్ట

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహిళా మార్ట్ నిధుల దుర్వినియోగంపై ఆర్డీవో

అద్దంకి, జూలై 20 : మహిళా మార్ట్ నిధులు దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. అద్దంకిలోని జగనన్న మహిళామార్ట్ నిధులు దుర్వినియోగంపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడం, మెప్మా సభ్యులు ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఇతర అధికారులతో కలిసి స్థానిక మెప్మా కార్యాలయం లో విచారణ చేశారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్ పెట్టుబడి, నిర్వహణ ఇతర అంశాలతో పాటు అవినీతి ఆరోపణలపై మెప్మా సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మార్ట్ నిర్వహణపై సీఎంఎం ఫణికుమారి జమా, ఖర్చులు వివరించగా, అందులో చోటు చేసుకున్న పలు అవకతవకలను పలువురు ఆర్‌పీలు ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. మహిళామార్ట్ మూసివేసే సమయంలో ఉన్న స్టాకు కంటే అనంతరం బ్యాంక్ ఖాతాలోకి అదనంగా డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మరోసారి పూర్తి స్థాయి విచారణ చేపడతామని, రికార్డులు అందుబాటులో ఉంచాలన్నారు. అవకతవకలు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. మునిపల్ కమిషనర్ సత్యనారాయణ, డీసీవో శ్యాంసన్ పాల్గొన్నారు.


మెప్మా సీఎంఎం ఫణికుమారి, ఆరోపీలను విచారిస్తున్న ఆర్డీవో

స్పాసెంటర్లపై పోలీసుల ఆకస్మిక దాడి

● అదుపులో ఎనిమిది మంది మహిళలు

ఒంగోలు(క్రైం), జూలై 20: ఒంగోలు నగరంలోని స్పాసెంటర్లపై శనివారం సాయంత్రం ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు చేశారు. మూడు బృందాలు కలిసి రెండు ప్రాంతాల్లో ఉన్న స్పాసెంటర్లలో ఆకస్మికంగా దాడులు చేసి ఎనిమిది మంది మహిళను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్పాసెంటర్లలో మహిళలు ఉండటంపై విచారణ చేస్తున్నారు. గుప్తాస్ మిడ్ విన్‌లో నడుస్తున్న స్పాసెంటర్‌లో ఐదుగురు మహిళలు ఉన్నారు. అక్కడ విలాసవంతమైన బెడ్‌లతో పాటు స్నానం చేయించేందుకు టబ్‌లు ఉన్నాయి. ఇక రంగారాయుడు చెరువు వద్ద ఉన్న మరో స్పాసెంటర్‌లో ముగ్గురు మహిళను అదుపులోకి తీసుకున్నారు. స్పాసెంటర్ల అనుమతులు, వారి వ్యాపారంపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఏకంగా అంత మంది మహిళలు అక్కడ ఎందుకు ఉన్నారనే విషయం తెలియాల్సి ఉంది.



పోలీసులు అదుపులోకి తీసుకున్న యువతులు


మసాజ్ కోసం ఉంచిన ఆయిల్


స్పా సెంటర్‌లో ఉన్న విలాసవంతమైన బెడ్

ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

తాళ్లూరు, జూలై 20: ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.సుభాషిణి తెలిపారు. శనివారం నాగంబొట్లపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని ఎస్సీ రైతులకు ప్రకృతిసాగు పరికరాలను ఆమె అందజేశారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా పది వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నేల సారవంతానికి పచ్చిరొట్ట ఎరువులు, ఘన ద్రవజీవామృతం, తెగుళ్ల నియంత్రనకు వివిధరకాల కషాయాల తయారీ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో జిల్లా వ్యాప్తంగా 250 మందికి రైతులకు సీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలు సలహాలు ఇచ్చేందుకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు రైతులకు ప్రభుత్వం చేయూత ఇస్తుందన్నారు. ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగు పరికరాలు, డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిమటా సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ప్రకృతిసాగు ఇన్‌చార్జ్ నరసింహం, ప్రభాకర్, యాతం శ్రీనివాసరెడ్డి, సూరిబాబు, వేడికోల నరసింహారెడ్డి, వీపీఏలు డి.శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ జలాలు
- దూపాడు వద్ద నేటి నుంచి పంపింగ్
- ఫలించిన ఎమ్మెల్యే చొరవ



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

మార్కాపురం, జూలై 20: రెండు నెలలుగా పట్టణ ప్రజలు తీవ్ర తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో మరోవైపు గుండ్లకమ్మలో నీరు నిండుకుంది. దీంతో ట్యాంకర్ల ద్వారా సరఫరానే దిక్కయింది. ఈ నేపథ్యంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్, పురపాలక, జలవనరుల శాఖామంత్రులకు సమస్య తీవ్రతను తెలియజేశారు. అంతేకాక ఎగువన కర్నాటకలో సమృద్ధిగా వర్షాలు కురిసి అక్కడి ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కూడా వరద నీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేసింది. కేవలం తాగునీటి చెరువులను నింపేందుకు మాత్రమే నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లాలోకి సాగర్ జలాలు ప్రవేశించాయి. పుల్లలచెరువు మండలం ముటుకుల వద్ద 85వ మైలు రాయి వద్దకు శనివారం మధ్యాహ్నానికే సాగర్ జలాలు చేరుకున్నాయి. త్రిపురాంతకం మండలం దూపాడులోని సాగర్ ప్రధాన కాలువ ఆదివారం నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు పంపింగ్ చేసేందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఫలించిన ఎమ్మెల్యే కందుల ప్రయత్నం

ఈ నెల 2న వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడి గురించి తీసుకెళ్లారు. ఇక్కడి పరిస్థితులను పూర్తిస్థాయిలో వివరించారు. అంతేకాక ఆ మరుసటి రోజే అమరావతి వెళ్లిన నారాయణరెడ్డి అక్కడ పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడులకు తాగునీటి సమస్య పరిష్కారానికి సాగర్ నీటిని విడుదల చేయాల్సిన ఆవశ్యతను వివరించారు. వెంటనే ఇద్దరు మంత్రులు ఈ నెల 4న జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులతో సమీక్షించారు. వారు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ అప్పటికే నాగార్జునసాగర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకున్నం దున నీటిని విడుదల చేయలేక పోయారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జు నసాగర్ జలాశయాలకు వరద నీరు చేరుతుండటంతో జిల్లాకు నీటిని విడుదల చేశారు.

మార్కాపురానికి తప్పనున్న నీటి కష్టాలు

ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో రోజుకు 120 ట్రిప్పులను ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అంతేకాక 35 వార్డుల పరిధిలోని 180 పవర్ బోర్లు కూడా కొంతమేర నీటిని అందిస్తున్నాయి. ఎస్ఎస్ ట్యాంకులో నీరు ఉన్న సమయంలో కూడా పట్టణంలో పది రోజులకు ఒకసారి సాగర్ నీటిని అందించారు.



కలెక్టర్, సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే (ఫైల్)

సుమారు నాలుగు నెలలపాటు ఇదే విధంగా నీటి సరఫరా కొనసాగింది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా కూడా పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేయడంతో పురవాసులకు నీటి కష్టాలు తప్పినట్లే.

అవీ.. ఇవీ..

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన యువకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 20: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణానికి చెందిన యువకులు శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆర్యవైశ్య సంఘ పట్టణ సహాయ కార్యదర్శి పి.అంజనేయులు, బీసీ సంఘ నాయకులు ఎం.రామకృష్ణ, బీహార్ కిషన్ పవన్ తదితరులు పార్టీలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ దేవిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న డాక్టర్ సమయ

గిద్దలూరు, జూలై 20 : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమయ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. రోగ నిర్ధారణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రోగులను గుర్తిస్తే తక్షణమే తగిన చికిత్సను అందించే ఏర్పాట్లు చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. ఇతర అంటు వ్యాధుల వలే సూక్ష్మక్రిముల వలన మైక్రో బాక్టిరియా ద్వారా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కుష్టు వ్యాధి సోకిన వారు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పక మందులు వాడితే తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధారాణి, సబ్‌యూనిట్ ఆఫీసర్ రంగనాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

గిద్దలూరు, జూలై 20 : పట్టణంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఓ విద్యార్థి రూ.4 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశాడు. పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాల డైరెక్టర్ చైతన్య కుమారుడు మాన్విత్ తాను దాచుకున్న డబ్బుతో వెళ్లి వారి మధ్యన జన్మదిన వేడుకలు జరుపుకొని విద్యార్థులకు సాయాన్ని అందజేశాడు.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏవో

కంభం, జూలై 20 : ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలని, కంభం మండల ఎంఈవోలు బి.మాల్యాద్రి, కె.శర్వాణిలు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉంటూ పాఠశాల విద్యలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతను అంది పుచ్చుకుని అడుగులు వేయాలన్నారు. మండలంలోని పాఠశాలల సౌకర్యాలు, అభివృద్ధి, సమగ్ర విద్యా ప్రణాళికలపై చర్చించారు. అనంతరం పాఠశాల వారిగా సమస్యలను సమీక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పత్తికి ప్రత్యామ్నాయంగా కంది సాగు మేలు

- ఏవో జవహర్ లాల్‌నాయక్

పెద్దదోర్నాల, జూలై 20: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తికి ప్రత్యామ్నాయ పంటగా కంది సాగు చేయాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్‌నాయక్ సూచించారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం, చిన్నదోర్నాల, కటకానిపల్లె గ్రామాల్లో కౌలురైతులకు పంటసాగుపత్రాల మంజూరుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుచేసే రైతులు సీసీఆర్‌సీ కార్డు పొందాలని తద్వారా ప్రభుత్వం మంజూరు చేసే పలు పథకాలను పొందవచ్చన్నారు. ప్రస్తుతం కంది విత్తనాలు 30శాతం రాయితీపై అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి జీ పోలమ్మ, వీఆర్‌వోలు రామయ్య, శ్రీనివాసులు, వీహెచ్‌ఏ నీలానాయక్, శ్వేత, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



కార్యక్రమంలో పాల్గొన్న పారిశుధ్య సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, జూలై 20: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జగదీశ్వరీ థియేటర్, రామలక్ష్మణ వీధి, జవహర్‌నగర్ తదితర ప్రాంతాలలో ప్రధాన కాలువలు శుభ్రం చేశారు. ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న కారణంగా ఇళ్లలో, పరిసరాలలో చెత్త నిల్వలేకుండా చూడాలని దోమలు వ్యాపించకుండా కొబ్బరిబోండాలు, పనికిరాని టైర్లు తీసివేయాలన్నారు. కాలువలలో చెత్త వేయరాదన్నారు.

కౌలు రైతు కార్డులపై గ్రామసభ

త్రిపురాంతకం, జూలై 20: కౌలురైతు కార్డులపై గ్రామసభను మండలంలోని మేడపిలోని రైతుసేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకుడు మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కు చట్టం- 2019పై వివరించారు. కౌలురైతులందరూ కార్డులను తీసుకుని ప్రభుత్వం అందించే రుణాలు, పంటబీమా పథకం, అన్నదాతా సుఖీభవ, పంటనష్టాలు జరిగినపుడు పరిహారాలు అందుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. సాగుదారుడికి కౌలుపత్రం ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు.. కార్డు పరిమితి కేవలం 11 నెలలు మాత్రమే పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్వో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

పెద్ద దోర్నాల, జూలై 20: ప్రమాదవశాత్తు విద్యుదాఘానికి గురై రెండు పాడి గేదెలు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్నగుడిపాడు గ్రామ పొలాల్లో శనివారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో ఆ గ్రామానికి చెందిన ఐనేని వెంకట నారాయణ, గిలక కోటేశ్వరరావుల పాడిగేదెలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. గేదెలు రోజు మాదిరి సమీప పొలాల్లోకి మేతకు వెళ్లాయి. గ్రామ చెరువుకు పైభాగాన ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నేలకు అతి సమీపాన ఉండడంతో గేదెలు ఆ తీగలను తాకాయి. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. ఎంతసేపటికీ గేదెలు ఇంటికి రాకపోవడంతో పొలాల్లో పరిశీలించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు గేదెలు మృతి చెందాయి. దీంతో కుటుంబ పోషణకు తోడ్పాటు నిచ్చే పాడిగేదెలు మృతి చెందడంతో తమకు ఎంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో గేదె రూ.50వేలు విలువ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అంతేగాక ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూడా ఎత్తు పెంచాలని లేకపోతె మరిన్ని పశువులు ప్రమాదానికి గురయ్యే అవకాశముందన్నారు.

తరగతి గదులు సీజ్

గిద్దలూరు టౌన్, జూలై 20 : పట్టణంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాల యాజమాన్యం ఒక ఇంట్లో అనుమతులు లేకుండా ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తోంది. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, గిద్దలూరు, రాచర్ల ఎంఈవోలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఎల్‌కేజీ, యూకేజీ నిర్వహిస్తున్నట్లు గుర్తించి విద్యార్థులను బయటకు పంపి ఆ గదులను సీజ్ చేశారు. అనుమతులు లేకుండా తరగతి గదులను నిర్వహిస్తున్న వైనంపై నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సాధన డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మార్కాపురం వన్‌టౌన్, జూలై 20: స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ దివీస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కప్పగంతుల మధుసూధన్ తెలిపారు. వివరాలకు 9440748307 నంబరును సంప్రదించాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కనాటుతున్న శివకరన్

గిద్దలూరు టౌన్, జూలై 20 : ఉత్తరప్రదేశ్‌లోని కరోనీకి చెందిన శివకరన్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తూ గిద్దలూరు చేరుకుని స్థానికులు ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని శివకరన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బరావుశర్మ, యోగా గురువు నారాయణరెడ్డి, బీజేపీ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, రూరల్ అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, తాలూకా కోకన్వీనర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

పొదిలి, జూలై 20 : రెండు రోజులుగా పట్టణంలో ముస్లిం యువకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న విషయం తెలుసు కున్న దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. జరుగు తున్న విషయాల గురించి ఎస్‌ఐ కోటయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని సమస్యను సున్నితంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కాదని ఇష్టారీతిన ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పార్టీలకు అతీతంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇరువర్గాల నుంచి ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఇరువర్గాలకు చెందిన 20 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో 7.5 మి.మీ వర్షపాతం నమోదు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20 : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 7.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొమరోలు మండలంలో 41.2, మార్కాపురం 27.4, గిద్దలూరు 16.4, తర్లుపాడు 15.4, రాచర్ల 13.4, కొండపని 11.8, చీమకుర్తి 11.0, పెద్దారవీడు మండలంలో 10.6 మి.మీ వర్షం పడింది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

పొగాకు కొనుగోళ్లు పూర్తి



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పొదిలి, జూలై 20 : పొదిలి వేలం కేంద్రం పరిధిలోని పొగాకు అధికారిక కొనుగోళ్లు నేటితో ముగిసినట్లు వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతన్నలు ఆనందోత్సాహాలతో ఉన్నారన్నారు. మొత్తం 104 రోజుల్లో 9.01 మిలియన కిలోల పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సగటున ధర రూ.271.61 పలికినట్లు చెప్పారు. అత్యధిక బిడ్ 364, అత్యల్ప బిడ్ 203గా ఉందన్నారు. మొత్తం 244 కోట్ల రూపాయలు బోర్డు పరిధిలో అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 39 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ ఏడాది ధరలను దృష్టిలో ఉంచుకొని అధిక ధరలకు బ్యారన్లు కౌలుపొలాలు తీసుకోద్దని సూచించారు. అత్యాశకుపోయి నష్టాలబారిన పడవద్దని రైతులను కోరారు. అదే విధంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టిపెట్టాలన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి

గిద్దలూరు, జూలై 20 : పట్టణ శివారు ప్రాంతాలలోని రోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్నాయి. మట్టిరోడ్లన్నీ బురదగా మారి నడిచేందుకు వీలుకాని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ వెనుక, పక్కన ఉన్న ప్రాంతంలోని రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. వర్షంకురిస్తే మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. సైకిళ్లు, మోటార్ సైకిళ్ల కూడా వెళ్లే పరిస్థితి లేదు. మనుషులు కూడా మోకాలిలోతు బురదలో దిగి నడిస్తే తప్ప తమ ఇళ్లకుగాని బయటకు గాని వెళ్లలేని పరిస్థితి ఉంది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు వర్షం పడితే ఇళ్లదాటి బయటకు రావడం లేదు. కనీసం కచ్చాడ్రైనులు కూడా లేకపోవడంతో వర్షం నీరంతా మట్టి రోడ్లపైనే ఉండి బురదమయంగా మారి ఆరేందుకు వారం పడుతోందని ఆ ప్రాంతం వాసులు పేర్కొంటున్నారు. అలాగే నల్లబండ బజారులోని శివారు వీధులు ఇలాంటి పరిస్థితే నెలకొంది. పాత సత్యనారాయ ణ థియేటర్ కొన్ని వీధుల్లో, అండర్ బ్రిడ్జి సమీప వీధుల్లో చిన్నపాటి వర్షం కురిసినా నడవలేని పరిస్థితి నెలకొంటోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతో రోడ్లు, కాలువలు నిర్మించే వరకైనా వర్షం నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా కచ్చాడ్రైన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తర్లుపాడు : మండలంలో చిన్నపాటివర్షం కురిసినా రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. మండలంలోని తాడివారి పల్లి, నాగెళ్లముడుపు, మంగళకుంట, రాగినసముద్రం, కలుజువ్వల పాడు, తర్లుపాడులోని కొన్ని వీధులలో చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతు న్నాయి. ఈ రోడ్లపై ప్రజలు నడవాలంటే నానా అవస్థలకు గురవుతున్నారు.



తాడివారిపల్లెలో రోడ్డు దుస్థితి



గిద్దలూరులో బురదమయమైన ఓ వీధి

తాడివారిపల్లిలోని ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తర్లుపా డు, తాడివారిపల్లెలోని రోడ్ల గురించి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలోనైనా గ్రామాల్లోని ప్రధాన రహదారులకు మోక్షం కలుగుతుందోమోనని ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

వర్షాలతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

మార్కాపురం రూరల్, జూన్ 20: రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతన్నలలో పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. నెలరోజుల క్రితం నుంచే భూములను దుక్కి దున్నుకొని పంటలు సాగు చేసేందుకు సమాయత్తం చేశారు. అప్పటి నుంచి వర్షం ఎప్పుడు వస్తుందా.? అని ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ శుక్రవారం రాత్రి నుంచి వర్షం ఉధృతంగా పడుతుండటంతో ఇక ఏడాది పంటలు సాగు చేసుకునేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. మండలంలో ప్రధానంగా మిరప, పత్తి, కంది పంటలను అధికంగా సాగు చేస్తారు. సాధారణంగా ఈ పాటికి సాగుకు సిద్ధం చేసుకున్న భూములలో కంది, పత్తి విత్తనాలు విత్తుకోవడం వంటి పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా కురిశాయి. దీంతో ఈ ప్రాంతంలో ప్రధానంగా కంది, పత్తి పంటలను సాగుకు కొంత జాప్యమైంది. ప్రస్తుత వర్షాలతో పొలంపనులు ఊపందుకోనున్నాయి. మార్కాపురం మండలంలో ఈ నెల 19న శుక్రవారం 14.4 మి.మీ వర్ష పాతం నమోదు కాగా 20న శనివారం 27.4మి. మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కంభం : కంభం సబ్‌డివిజన్‌లో రైతుల ఆశలు చిగురింపజేస్తూ ఓ వైపు బంగాళాఖాతంలో వాయుగుండం, మరోవైపు రుతుపవనాల ప్రభావంతో నాలుగు రోజులుగా ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తున్నాయి. మార్కాపురం డివిజన్‌లోని మండలాల్లో కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. వారంక్రితం వరకు కంభం సబ్ డివిజన్‌లో చినుకు రాలకపోవడంతో ఖరీఫ్‌పై ఆశలు సన్నగిల్లాయి. ప్రస్తుత వర్షాలు రైతులకు ఊరటనిస్తున్నాయి. దీంతో బీటలువారి నెర్రె లిచ్చిన భూములన్నీ పదునెక్కాయి. పొలాల్లో, కాలువల్లో నీళ్లు నిలిచాయి. పలుచోట్ల కుంటలు, చెక్‌డాంలు కళకళలాడుతున్నాయి. వర్షాలతో తాగునీటి బోర్లలో జలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పొలం సిద్ధం చేసుకుంటున్న రైతులు (ఫైల్)

సాగుపనిలో రైతులు

జూలై 15వ తేదీ వరకు వర్షాలు కురవక ఖరీఫ్‌పై ఆశలు వదులుకున్న రైతులు పొలాలను బీళ్లుగా వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాలను దుక్కిదున్ని సాగు కు సిద్ధమవుతున్నారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో రైతులు కంది, పత్తి, మిర్చి, కొర్ర, సజ్జ పంటలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



పదునైన పొలాలు

గిద్దలూరు టౌన్ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో గిద్దలూరు ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా ఆకాశం మేఘాలతో ఉండగా శుక్రవారం ఉదయం నుండి చిరుజల్లులు, ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. ఇటీవల కాలంలో అడపాదడపా వర్షాలు కురవడం కారణంగా మండలంలోని పలు గ్రామాలలో రైతులు పంటలను సాగు చేశారు. మిరప, టమోటా, నూగు, పెసర, మొక్కజొన్న లాంటి పంటలను రైతులు సాగు చేశారు. ఇప్పటికే పంటసాగు చేసిన రైతుల్లో కొంత ఆందోళన ఉండగా, ప్రస్తుత వర్షాలు ఊరటనిస్తున్నాయి. ఏకకాలంగా కురుస్తున్న వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య తీరనున్నదని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి బాదినేనిపల్లిలో పీర్లపండుగ

తెలుగురాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో హాజరుకానున్న భక్తులు

కొమరోలు, జూన్ 20: మండలంలోని బాదినేనిపల్లిలోని ఖాశింస్వామి పీర్ల పండుగ మహోత్సవాలు నేటి నుంచి బుధవారం వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం చిన్న షరిగేతురోజు రాత్రి కోలాటం, సోమవారం పగలు షరిగేతు రోజు సాయంత్రం కుటుకు భజన, పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం రోజు పెద్ద సరిగేతు సందర్భంగా చావిడిలోని చిన్న ఖాశిం స్వామి, పెద్ద ఖాశింస్వామి, వెండిపీర్లను ప్రత్యేక పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. ఈ పీర్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ముక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో మొద్దులు, కలపను తీసుకొచ్చి గుండంలో వేస్తారు. రాత్రి పేరాలవారితో విభిన్నమైన రీతిలో బాణసంచా కాలుస్తారు, ఒంగోలు వారి ఆధ్వర్యంలో పాటకచేరి కార్యాక్రమాలు కూడా జరుగుతాయి. బుధవారం పీర్లు స్నానానికి వెళ్లడంతో కార్యక్రమం ముగుస్తుంది.



ముస్తాబైన బాదినేనిపల్లి పీర్లచావిడి

ఆటోనగర్‌లో అన్నీ కష్టాలే

- రోడ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది
- వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానం
- మురుగు కాలువలు, కొళాయిలు కరువు



ఆటోనగర్‌కు వెళ్లే మట్టిదారి

మార్కాపురం రూరల్, జూన్ 20 : గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి పట్టణంలోని ఆటోనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురం పట్టణ సమీపంలోని దరిమడుగు పంచాయతీ పరిధిలో 2018 నవంబర్‌లో ఆటోనగర్‌ను ప్రారంభించారు. అప్పటి మంత్రి హోదాలో నారా.లోకేష్ ఆటోనగర్ ప్రారంభించారు. ప్రాథమిక వసతులతో నాటి టీడీపీ ప్రభుత్వ ఆటోనగర్‌ను ప్రారంభించింది. అనంతరం 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇక్కడ మౌలిక వసతుల ఊసే మరిచింది. దీనికి తోడు నారా లోకేష్ పర్యటించిన సమయంలో ఏర్పాటు చేసిన రోడ్డుమార్గాన్ని సైతం పట్టణంలోని వైసీపీ నాయకుడు వెంచర్ వేసి ప్రహరీ గోడ నిర్మించుకొని ఆక్రమించాడు. దీంతో ఆటోనగర్‌లో ఉంటున్న వారు అందరూ కలిసి కొంత ధనం సమకూర్చుకొని మరొక రోడ్డుమార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కానీ వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లభించలేదు. సొంత నిధులతో రోడ్డుపై మట్టిని తోలుకొని తాత్కాలికంగా రహదారిని ఏర్పాటు చేసుకున్నారు.

వర్షంపడితే నరకమే..

వర్షంపడిన సమయంలో ఆటోనగర్ వెళ్లాలంటే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. వర్షంపడిన సమయంలో ఆటోనగర్‌కు మరమ్మతుల కోసం వాహనాలు కూడా రావడం లేదని ఆ నగర్ వాసులు ఆవేదన చెందుతున్నారు. మరికొంత మంది వర్షాకాలంలో ఆటోనగర్‌కు వెళ్లకుండా పనులను కూడా వాయిదా వేసుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఆటోనగర్‌కు రాకపోకలు చేస్తుంటాయి. అయితే వర్షాకాలంలో మరమ్మతుల కోసం వాహనాలు కూడా రావడం లేదని ఇక్కడి దుకాణాల వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు, సంబంధిత అధికారుల ఆటోనగర్‌పై ప్రత్యేక దృష్టిసారించి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రతి దుకాణానికి కొళాయిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రెండు మినీట్యాంకులు ఉన్నాయని వాటి వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారన్నారు.



దరిమడుగు సమీపంలోని ఆటోనగర్

నేటి నుంచి డోన్ ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభం

దొనకొండ, జూలై 20: గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలుమార్గంలో రైల్వే డబ్లింగ్ లైను పనులతో ఇటీవల రైల్వే అధికారులు తరచూ తాత్కాలికంగా రైళ్లను రద్దు చేస్తున్నారు. రద్దు అయిన రైళ్లల్లో ఆదివారం నుంచి డోన్ ఎక్స్‌ప్రెస్‌ను పునఃప్రారంభించేలా సంబంధిత అధికారులు ఆదేశాలు జారీచేశారు. గుంటూరులో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరే 17228 నెంబరు గల గుంటూరు-డోన్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం నుంచి, డోన్‌లో ఉదయం 6.30 గంటలకు బయలుదేరే 17227 నెంబరు గల డోన్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం నుంచి పునఃప్రారంభించేలా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

పామూరు, జూలై 20: మొహర్రం ముగిసిన అనంతరం 12వ రోజు జరుపుకునే జియారత్ ప్రత్యేక ఫాతేహాలు (ప్రార్థనలు) ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా పూడ్చిఉన్న గుండం వద్ద పప్పులు, బొరుగులు, తమలపాకులు, గంధం పూలను చల్లి, అగరొత్తులను వెలిగించి ఫాతేహాలను ముజావర్లు నిర్వహించారు. జియారత్ ఫాతేహాలతో మొహర్రం వేడుకలు ఈఏడాది సంపూర్ణంగా ముగిసినట్లు ముజావర్లు తెలిపారు.

కరోళ్లపాడు రహదారికి మరమ్మతులు

పామూరు, జూలై 20: మండలంలోని కరోళ్లపాడు రహదారికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చొరవతో మరమ్మతు పనులు చేపట్టారు. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కరోళ్లపాడు రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.1.12 కోట్ల నిధులను మంజూరుచేశారు. గత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉద్దేశపూర్వకంగా రెండు చప్టాలు మాత్రమే నిర్మించి వదిలివేశారు.

గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలకులకు పలుమార్లు రహదారి గురించి విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈక్రమంలో రహదారి కష్టాల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి అధికారులను ఆదేశించడంతో రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. దాంతో తాత్కాలికంగా రోడ్డు సమస్య పరిష్కారమైందని గ్రామస్థులు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

పామూరు, జూలై 20: పట్టణంలోని పాత పోస్టాఫీసు ఎదురుగల శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిరం చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆహ్వానపత్రికలను శనివారం సాయిబాబా మందిరంలో ఆవిష్కరించారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా సాయిబాబా మందిరాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. బాబా విగ్రహానికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు సుమారు నాలుగువేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సర్వ మతాలకు చెందిన భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం

పీసీపల్లి, జూలై 20: ఈ ఏడాది ఖరీఫ్‌లో భూమిని కౌలుకు తీసుకుని పంటను సాగుచేస్తున్న కౌలు రైతులందరికీ కార్డులు ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి జి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం, పెదఅలవలపాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో శనివారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకార్డు పొందడం ద్వారా పంటలసాగుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందవచ్చునని చెప్పారు. కౌలు రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే కౌలుకార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వీవోఏ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాగర్ కాలువలు

- ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం

దర్శి, జూలై 20: సాగర్ కాలువలు గత ఐదు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటి రంగం నిర్వీర్యమైంది. గత వైసీపీ పాలనలో కనీసం చిల్లచెట్లు కూడా తొలగించిన పాపానపోలేదు. వైసీపీ పాలకులు చేసిన పాపాలు రైతులకు శాపంగా మారాయి. సాగర్ ప్రధాన కాలువతోపాటు దర్శి బ్రాంచ్ కాలువ, ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలు అనేకచోట్ల దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల కట్టలు కోసుకుపోయి పూర్తిగా బలహీనపడ్డాయి. మరికొన్నిచోట్ల లైనింగ్ దెబ్బతింది. సాగర్ కాలువలో పూర్తిస్థాయిలో నీరు విడుదలయితే కట్టలు బలహీనపడిన చోట తెగిపోయే ప్రమాదం నెలకొంది.



పూర్తిగా కోసుకుపోయిన సాగర్ కాలువ కట్ట



దెబ్బతిన్న సాగర్ కాలువ కట్ట లైనింగ్



కాలువకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చిల్లచెట్లు



రూపురేఖలు కోల్పోయిన మైనర్ తూములు

కాలువ కట్టలకు ఇరువైపులా అనేకచోట్ల చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. మేజర్లు, మైనర్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అనేక మేజర్లు, తూములు, డ్రాపులు పగిలిపోయి కాలువలు పూడిపోయి రూపురేఖలు కోల్పోయాయి.

గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్వహించిన మరమ్మతులు తప్ప వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేజర్లు, మైనర్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఈఏడాది కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈఏడాది సాగునీరు వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే, కాలువల పరిస్థితి అధ్వానంగా ఉండటంతో నీటి సరఫరా ఇబ్బందికరంగా మారే పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సాగర్ కాలువలకు అత్యవసర మరమ్మతులయినా చేస్తారని రైతులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 4.5 లక్షల సాగర్ ఆయకట్టు భూమి ఉంది. దర్శి ఎన్‌ఎస్‌పీ డివిజన్‌లో 99వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గత ఐదేళ్లలో సాగునీరు సక్రమంగా అందిన దాఖలాలు లేవు. అధికశాతం ఆయకట్టు భూములు బీళ్లుగా మిగిలిపోయాయి. ఈఏడాదయినా సాగునీరు అందుతుందని, పుష్కలంగా పంటలు పండుతాయని అన్నదాతలు సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్నారు. కాలువల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిన అధికారులు

సాగర్ కాలువల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లు వరుసగా ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈఏడాది కూడా ఆనవాయితీ ప్రకారం చిల్లచెట్లు తొలగించేందుకు, గండ్లు పూడ్చేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. దర్శి డివిజన్ పరిధిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.90 లక్షలు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎన్‌ఎస్‌పీ అధికారులు తెలిపారు.

దర్శిలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

- పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

దర్శి, జూలై 20: దర్శి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. గడియార స్తంభం సెంటర్‌లో నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ గురించి పట్టించుకున్న నాథుడు లేడు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ చెడిపోయి నిరుపయోగంగా మారాయి. పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దర్శి పట్టణ నడిబొడ్డున ఉన్న గడియారస్తంభం కూడలిలో కూడా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేయటం మానుకున్నారు. దీంతో వాహనచోదకులు ఎవరికి వారు ముందు వెళ్లాలనే ఉద్దేశంతో అడ్డదిడ్డంగా వెళ్తుండటంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. గతంలో నిరంతరం పోలీసులు గడియార స్తంభం వద్ద ఉండి క్రమబద్ధీకరించేవారు. సిగ్నల్స్ వేసి ఎవరు ఎటువైపు వెళ్లాలో నిర్దేశించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గురించి పట్టించుకోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతుంది. ప్రస్తుతం ఉన్న అధికారులు ఎలాగూ బదిలీ అవుతామనే ఉద్దేశంతో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటూ ట్రాఫిక్ సమస్య గురించి పట్టించుకోవటం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



దర్శి గడియార స్తంభం సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

పార్కింగ్ స్థలం ఏర్పాటుచేయని అధికారులు

దర్శి పట్టణంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ పార్కింగ్ స్థలం ఇప్పటివరకు ఏర్పాటుచేయలేదు. పట్టణ ప్రజలతో పాటు అనేక గ్రామాల నుంచి వాహనాలపై వచ్చే ప్రజలు రోడ్డు మార్జిన్‌లో వాహనాలు పెట్టి తమ పనులు పూర్తి చేసుకొని వెళ్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు అడ్డుగా పెట్టడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాలు తొలిగే వీలులేకపోవటంతో గడియారస్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటుచేస్తామని అధికారులు ఎంతోకాలంగా చెబుతున్నా కార్యరూపం దాల్చలేదు. కొంతకాలం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బారికేడ్లు కట్టి కొన్ని వాహనాలను అక్కడ ఏర్పాటుచేసే అవకాశం కల్పించారు. ప్రస్తుతం వాహనాల సంఖ్య అధికం కావటంతో అక్కడ పట్టక రోడ్లపై వందలాది వాహనాలు నిలుపుతున్నారు. దర్శి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య నివారణకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైకిల్ స్టాండ్ నిర్మించరూ..

పామూరు, జూలై 20: పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిల్ స్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలకులు భూమిపూజ చేసి నేటికి రెండేళ్లు దాటుతున్నా కార్యరూపం దాల్చలేదు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 950 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సైకిల్ స్టాండ్ లేకపోవడంతో పాఠశాల ప్రహరీ వెలుపల పెట్టుకోవాల్సివస్తుంది. సైకిళ్లకు సరైన రక్షణ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈనేపథ్యంలో 2022 మార్చిలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఉపసర్పంచ్ సాయికిరణ్, వైసీపీ నాయకులు సైకిల్ స్టాండ్ షెడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. పనులు త్వరగా పూర్తిచేస్తామని ఇచ్చిన హామీ నేటికి రెండేళ్లు కావస్తున్నా కార్యరూపం దాల్చలేదు. వెంటనే సైకిల్ స్టాండ్ ఏర్పాటుచేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు

విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 20: ప్రస్తుత సమాజంలో బాలికలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాజ్‌బాషా పేర్కొన్నారు. వాటిని అధికమించడానికి చదువు ఒక్కటే మార్గ మని సూచించారు. సీఎస్‌పురంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం చదువులు -విలువలు అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఎస్‌వో రేష్మ అధ్యక్షత వహించారు. గయాజ్ మాట్లాడుతూ బాలికల చదువుకు పేదరికం అడ్డుకాకూడదని అన్నారు. ఎంఈవో ప్రసాదరావు మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రభుత్వాలు అన్ని అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పాపారాయుడు, రిసోర్స్‌పర్సన్ ఫణి, తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలి

ముండ్లమూరు, జూలై 20: మండలంలోని లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని ట్రాన్స్‌కో ఏడీఈ కె.పిచ్చయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో ప్రజలు స్తంభాలను తాకటం, ట్రాన్స్‌ఫారాలను ముట్టుకోవటం వంటివి చేయకుండా అవగాన కల్పించాలన్నారు. మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. మండలంలో కోటి రూపాయల వరకు బకాయిలు పేరుకుపోయాయన్నారు. సమావేశంలో ఏఈ వీరబ్రహ్మం, లైన్ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, సబ్ ఇంజనీరు ఇమ్మానియేలు బాబు, లైన్‌మన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రూ.42 లక్షలు దుర్వినియోగం

- సామాజిక తనిఖీలో గుర్తింపు
- ప్రజావేదిక పరిశీలన అనంతరం రూ.2 లక్షల 61 వేలు రికవరీ

తాళ్లూరు, జూలై 20: ఉపాధి హామీ పథకం కింద 2023-2024ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో రూ.42 లక్షలు దుర్వినియోగమయ్యాయి. ఈమేరకు సామాజిక తనిఖీలో గుర్తించారు. ఇందుకుసంబంధించి శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో పీడీ అర్జునరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2023 నుండి మార్చి2024 వరకు ఉపాధి పథకం కింద 839 పనులకు రూ.9 కోట్ల 12లక్షల 93 వేల నిధులు ఖర్చు చేశారు. ఈ తనిఖీలో దాదాపు రూ.42 లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఆడిట్‌లో డీఆర్పీలు గుర్తించిన అవకతవకల్లో ప్రజావేదిక పరిశీలన అనంతరం రూ.2 లక్షల 61వేల నగదు రికవరి చేస్తున్నట్లు పీడీ తెలిపారు. ఎక్కువగా మస్టర్లలో దిద్దుబాటు, కొట్టివేతలు ఉన్నాయని, కూలీలు సంతకాలు పెట్టకుండానే బిల్లులు చెల్లింపులు జరిగాయని, నాటిన మొక్కలు చాలావరకు తేవని, గ్రామాల్లో జరిగిన పనుల వద్ద పనుల వివరాలు తెలిపే బోర్డులు లేవని సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు వెల్లడించారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ అర్జునరావు

ప్రజావేదిక అనంతరం డ్వామా పీడీ అర్జునరావు మాట్లాడుతూ మండలంలో ఉపాధి కింద చేపట్టే పనుల నిర్వహణకు ఎర్రర్ రిజిస్టర్ వినియోగించక పోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. బాధ్యతగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో కె.యుగకీర్తి, జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి రూన్సీ, ఇన్‌చార్జ్ ఏపీడీ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి పట్టణాభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 20: కనిగిరి పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహ కారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎక్స్‌అఫిషియో మెంబర్ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. గత సమావేశం కోరం లేక వాయిదా పడటంతో శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు రూ.82 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పట్టణంలో వీధి లైట్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, కూరగాయల మార్కెట్, చేపలు, మాంసం మార్కెట్ ఏర్పాటుచేయాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి అంచనాలు వేసినట్లు చైర్మన్ వివరించారు. పట్టణంలో పారిశుధ్య సిబ్బంది అవసరం ఉందని చెప్పారు. ఇందుకోసం తగిన అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏఐబీ నిధులు కింద కుళాయిల ద్వారా ఇంటింటికి మంచినీటిని సరఫరా చేయాలని కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సానుకూలంగా స్పందించి కనిగిరి పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు, అభివృద్ధి పనులు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించటంతో పాటు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి నిధులు సమీకరిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

రహదారుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శాఖ ద్వారా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్డు మరమ్మతు పనుల ప్రతిపాదనలను రూపొందించి నివేదించాలని ఆదేశించారు. ఈసందర్భంగా ప్రతిపాదిత పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎస్ఈ దేవానందం, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

తాళ్లూరు, జూలై 20: ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.సుభాషిణి తెలిపారు. శనివారం నాగంబొట్లపాలెం రైతుసేవా కేంద్రం పరిధిలోని ఎస్సీ రైతులకు ప్రకృతిసాగు పరికరాలను ఆమె అందజేశారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా పదివేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నేల సారవంతానికి పచ్చిరొట్ట ఎరువులు, ఘన ద్రవజీవామృతం, తెగుళ్ల నియంత్రనకు వివిదరకాల కషాయాల తయారీ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో జిల్లా వ్యాప్తంగా 250 మందికి రైతులకు సీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలు సలహాలు ఇచ్చేందుకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు రైతులకు ప్రభుత్వం చేయూత ఇస్తుందన్నారు. ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగు పరికరాలు, డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు అందజేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ చిమటా సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ప్రకృతిసాగు ఇన్‌చార్జ్ నరసింహం, ప్రభాకర్, యాతం శ్రీనివాసరెడ్డి, సూరిబాబు, వేడికోల నరసింహారెడ్డి, వీఏఏలు డి.శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు

కనిగిరి, జూలై 20: ప్రతిఏటా గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సాయిబాబా దేవస్థానం ట్రస్ట్ ద్వారా విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నారు. అందులోభాగంగా శనివారం స్థానిక సాయిబాబా దేవస్థానంలో సాయి సప్తాహ కార్యక్రమం ముగింపు సందర్భంగా నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సాయి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. దేవస్థాన అధ్యక్షుడు దేవకి సుబ్రమణ్యం చేతుల మీదుగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో విజేత కళాశాల ప్రిన్సిపాల్ అరుణోదర్, దేవస్థానం సభ్యులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 21 జూలై 2024



పెనుమూడి వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న బాపట్ల ఎస్పీ తుషార్‌డూడి

మీ-సేవలు.. లేవు

- కేంద్రాల్లో నిలిచిన ప్రభుత్వ సేవలు
- 15 రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇక్కట్లు
- ఎన్‌వోసీలపై జాప్యం చేస్తున్న సర్వీసు ప్రొవైడర్లు

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మీ-సేవ కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు గత కొద్ది రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందకపోతుండ టంతో వివిధ రకాల సర్టిఫికేట్ల కోసం ముఖ్యంగా విద్యార్థులు ఇక్కట్లకు గురౌతున్నారు. ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో వివిధ సర్టిఫికెట్లను అప్‌లోడింగ్ చేయాల్సి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొంటే అక్కడి నుంచి వీఆర్‌వో, ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్‌డీవో లాగిన్‌ల వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. దీంతో పుణ్యకాలం పూర్తి అవుతున్నది. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 230 వరకు మీ-సేవ కేంద్రాలున్నాయి. వీటికి ఏపీఆన్‌లైన్, రామ్ ఇన్‌ఫో, సీఎంఎస్‌లు సర్వీసు ప్రొవైడర్లుగా ఉన్నారు. అయితే ఈ మూడు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు పడినట్లు తెలిసింది. దీంతో రెండు వారాల క్రితం ప్రభుత్వం మీ-సేవా కేంద్రాలకు సర్వీసులను నిలిపేసింది. ఆయా సంస్థలు జిల్లా కలెక్టర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వానికి బకాయిలు ఏమి లేనట్లుగా ఎన్‌వోసీలు తెచ్చుకొంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని చెప్పింది. అయితే ఆయా సంస్థలు ఎన్‌వోసీలు తెచ్చుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఈ కారణంగా మీ-సేవా కేంద్రాల్లో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో నగటున రోజుకు 300 నుంచి 400 వరకు సర్వీసులను ప్రజలు వినియోగించుకొంటుంటారు. విద్యుత్, ఆస్తి, నీటి పన్నులు, ఆర్‌టీఏ, రిజిస్ట్రేషన్, రెవెన్యూ తదితర సేవల కోసం వీటికే ఎక్కువగా వెళుతుంటారు. అక్కడ సర్వీసు ఛార్జీలు చెల్లించుకొని నిర్దీత తేదీకి సర్టిఫికేట్లను కేంద్రాల నిర్వాహకులు అందజేస్తుంటారు. కులధ్రువీకరణ, నివాస, ఆదాయం వంటి సర్టిఫికేట్లను అడ్మిషన్ల సమయంలో విద్యా సం స్థలు కోరుతుంటాయి. దాంతో అందరూ మీ-సేవ కేంద్రాల వైపే చూస్తుంటారు. ఒకసారి కులధ్రువీకరణ పత్రం ఇచ్చిన తర్వాత మళ్లీ తాజాగా తీసుకురావాలని కోరవద్దని ప్రభుత్వం ఆదేశించినా వివిధ శాఖలు వాటిని బేఖాతరు చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు తాజాగా కులధ్రువీకరణ పత్రం తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తున్నాయి. అయితే ఈ సందర్భంగా విద్యార్థుల అవసరాన్ని సొమ్ము చేసుకొనేందుకు కొంత మంది రెవెన్యూ ఉద్యోగులు మైగ్రేషన్ సర్టిఫికేట్ తీసుకురావాలని చెబుతున్నారు. ఆ సర్టిఫికేట్ తెచ్చుకోలేక దళారులను ఆశ్రయించి రూ. 5 వేలు సమర్పించుకొన్న తర్వాత కులధ్రువీకరణ పత్రం వారి చేతికి అందుతున్నది. కాగా మీ-సేవ కేంద్రాల వలన రోజుకు రూ. కోటి వరకు ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంటుంది. గత 15 రోజులుగా నిలిచిపోవడం వలన ఆ మేరకు ప్రభుత్వానికి నష్టం జరిగింది. దీని దృష్ట్యా తక్షణమే సర్వీసులు పునరుద్ధరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

తీరం.. అప్రమత్తం

- మూడు రోజులుగా వర్షం
- బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల
- ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన అధికారులు
- వీడని వర్షాలతో వెద పెట్టిన వరికి కొంత మేర నష్టం


బాపట్ల(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి టౌన్, రేపల్లె, గుంటూరు సిటీ, జూలై 20: అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను ఒడిస్సా వైపునకు వెళ్లడంతో శనివారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం పడింది. కృష్ణానది పరీవాహక ప్రాంతంతో పాటు ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ జలకళను సంతరించుకుంటోంది. నదిపై శ్రీశైలం జలాశయానికి ఎగువున ఉన్న ప్రాజెక్టులు నిండుకుండల్లా మారడంతో గేట్లు ఎత్తారు. దీంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతూ వస్తోంది. ఇదే సమయంలో వర్షాలు కూడా విస్తారంగా కురుస్తున్నాయి. అదే సమయంలో పట్టిసీమ నుంచి కూడా గోదావరి జలాలు వస్తుండడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తింది. దీంతో నాలుగు గేట్లు తెరిచి నీటిని కిందకు వదిలారు. ఈ పరిస్థితుల్లో బ్యారేజికి దిగువన ఉన్న తీర ప్రాంతప్రజలతో పాటు బాపట్ల జిల్లాలోని తీరప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో తొలిసారిగా ప్రకాశం బ్యారేజి దిగువకు వరద నీటిని అధికారులు శనివారం విడుదల చేశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర, తదితర వాగుల నుంచి 7100 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నట్లు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 8 గేట్లను ఒక అడుగుమేర ఎత్తి 5800 క్యూసెక్కుల నీరు దిగువకు వదులు తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు. వర్షం కోసం ఎదురు చూసిన రైతులు ప్రస్తుతం కురుస్తోన్న వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మండలాల్లో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోని పంటలకు ఈ వానలు మేలే అన్న మాట వినిపిస్తోంది. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. తెరిపిస్తే అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో వెద పెట్టిన వరికి కొంత మేర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో సగ టున 73 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది.



రేపల్లె వద్ద పొలాల్లో నిలిచిన వర్షపునీరు

బాపట్ల ఎస్పీ డూడీ పరిశీలన..


రేపల్లె మండలం పెనుమూడి వంతెన వద్ద కృష్ణానది ప్రవాహాన్ని బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ శనివారం పరిశీలించారు. అల్పపీడన ప్రభావం మరో రెండు రోజులు ఉండనుందనే వాతావరణ శాఖ సంకేతాల దృష్ట్యా విధుల్లో నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోకి ముంపు ప్రాంత ప్రజలు వెళ్లాలని, తక్షణ సహాయం కొరకు 100కు డయల్ చేయాలని తెలిపారు. రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మట్లాడుతూ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సేవలకు పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కె.నజీర్‌బేగ్, తదితరులు ఉన్నారు.



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు



మిర్చి మాంద్యం



- నెలలుగా పెరగని ధర
- బోర్డు తిప్పేస్తున్న వ్యాపారులు
- ఆర్థికంగా చితికిపోతున్న రైతులు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఇటీవల పదిమందికి పైగా వ్యాపారులు అదృశ్యం
- న్యాయం చేయలేని స్థితిలో గుంటూరు మార్కెట్ కమిటీ
- మార్కెటింగ్ చట్టాన్ని సవరించకపోతే రైతుల మెడకు ఉరే

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి.. ఎర్ర బంగారం లావాదేవాల్లో నెలకొన్న మాంద్యం రైతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. కమీషన్, ఎగుమతి వ్యాపారులు అప్పు తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసి నెలల తరబడి ఎదురు చూస్తున్నా మార్కెట్‌లో ధర ఏమాత్రం పెరగడం లేదు. దీంతో అప్పులు పెరిగిపోయి వ్యాపారులు బోర్డు తిప్పేస్తున్నారు. రైతులకు చెల్లించాల్సిన బాకీలు చూస్తే రూ.కోట్లలో ఉంటే తమ వద్ద ఆస్తులు రూ.లక్షల్లోనే ఉన్నాయని, వాటిని విక్రయించి సర్దుబాటు చేయాలని ఇన్‌సాల్వెన్స్ పిటీషన్(ఐపీ)లు దాఖలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో 10 మందికి పైగా వ్యాపారులు ఇలా అదృశ్యం కావడంతో రైతులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సరుకు విక్రయానికి తీసుకురావాలంటేనే భయపడిపోతున్నారు. ఏ రోజున ఏ వ్యాపారి అదృశ్యం అన్న వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చి విస్తీర్ణం పెరగడంతో దిగుబడి భారీగా వచ్చింది. మరోవైపు చైనా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో ఈ సంవత్సరం మిర్చి సీజన్‌లోనే మాంద్యం నెలకొన్నది. అయితే మార్కెట్ పెరుగుతుందన్న ఆశతో కమీషన్ వ్యాపారులు, ఎగుమతిదారులు అప్పులు తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేశారు. అయితే రైతులకు పూర్తిస్థాయిలో నగదు చెల్లించకుండా 50 శాతం ఇచ్చి మిగతాది సరుకు అమ్మగానే ఇస్తామని చెప్పి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ పెట్టారు.

● రైతులకు రూ.కోట్లలో బకాయిలు

ఇటీవల గురజాలకు చెందిన ఓ షరం రూ.10 కోట్ల మేరకు రైతులకు బకాయిలు ఎగ్గొట్టింది. భవాని చిల్లీస్ ట్రేడింగ్ అనే సంస్థ అయితే దాదాపుగా రూ.50 కోట్ల మేరకు బకాయి పడిందని రైతులు చెబుతున్నారు. ఇదేవిధంగా కనకయ్య, జీరో రామయ్య, యాగ్రోక్రాఫ్స్, టీ వెంకటేశ్వరరావు, జేఎండీ, జేఎంజే, విజయకృష్ణ ట్రేడర్స్, వీఎస్‌ఆర్ ట్రేడర్స్ నాగిరెడ్డి, వరుణ్ ఎక్స్‌పోర్ట్స్ నిర్వాహకులు రైతులకు పెద్దమొత్తం లోనే బకాయి పడ్డారు. రైతులు వారి చుట్టూ తిరిగి తాము మోసపోయామని ప్రతీ సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో జరిగే పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటూ న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.2 వేలకు పైగా తగ్గిన ధర

ఈ సంవత్సరం మార్చితో పోల్చి చూస్తే మిర్చి ధరలు పతనమయ్యాయి. క్వింటాల్‌కు రూ.2 వేల వరకు తగ్గింది. గుంటూరు మిర్చియార్డుకు ఎక్కువగా ఆర్మూరు, తేజ, 334, విత్తన రకాలు, సింజెంటా బ్యాడిగి వంటివి వస్తాయి. అలానే తాలుకాయలు కూడా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతాయి. సీజన్‌కు ముందు నాణ్యతని బట్టి తేజ వెరైటీ ధర క్వింటాల్ రూ.22 వేల వరకు ఉన్నది. నేడు రూ.18 వేల లోపే ధర లభిస్తున్నది. తాలుకాయలకు అయితే క్వింటాల్‌కు రూ.6 వేలు కూడా రావడం లేదు. ఒకప్పుడు సింజెంటా బ్యాడిగి క్వింటాల్ రూ. 30 వేలకు పైగా ధర ఉంటే నేడు రూ.13 వేలకే లభిస్తున్నది. ఈ కారణంగా క్రెడిట్ తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసిన వారు నిలదొక్కుకోలేని పరిస్థితి నెలకొన్నది.

వైసీపీ సానుభూతిపరులతో నిండిపోయిన అసోసియేషన్

గుంటూరు మిర్చియార్డులో కమీషన్ వ్యాపారుల అసోసియేషన్ అంతా వైసీపీకి కొమ్ముకాసే సామాజిక వర్గీయులతో నిండిపోయి ఉన్నది. దీంతో అసోసియేషన్‌ని ఆశ్రయించినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోతున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నా కమీషన్, ఎగుమతి వ్యాపారులు మోసం చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితి. కేవలం నామమాత్రంగానే బ్యాంకు గ్యారెంటీలు మార్కెట్ కమిటీ వద్ద ఉంటాయి. అవి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల లోపే ఉంటాయి. ఈ మొత్తం కూడా మార్కెట్ కమిటీకి అద్దె, ఫీజు ఎగ్గొడితే రికవరీ చేసుకోవడానికి మాత్రమే. రైతులకు దీని నుంచి పరిహారం ఇప్పించలేని పరిస్థితి. మార్కెట్ కమిటీ ఎంతసేపటికీ మార్కెట్ ఫీజు వసూలు చేసుకోవడం పైనే దృష్టి పెడుతుంది తప్ప వ్యాపారులు చేస్తున్న లావాదేవీలను క్రమబద్ధీకరించడం లేదు. ఇది కూడా వ్యాపారులు బోర్డు తిప్పేయడానికి కారణమౌతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ చట్టంలో సవరణలు చేయడంతో పాటు ఎవరికి పడితే వారికి కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఇవ్వకుండా నియంత్రించే విధంగా చర్యలు చేపట్టకపోతే మిర్చి రైతుల మెడకు ఉరితాళ్లు తప్పేలా లేవు.



భార్గవ్ తేజ (గుంటూరు జేసీ)



ధనుంజయ్ (పల్నాడు జేసీ)



నవీన్ (సీఆర్‌డీఏ అదనపు కమిషనర్)



దినేష్‌కుమార్ (గుంటూరు కమిషనర్)

బదిలీలు.. నియామకాలు

గుంటూరు, నరసరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఒకరు బదిలీ కాగా నలుగురికి పోస్టింగ్‌లు దక్కాయి. గతంలో జరిగిన బదిలీల్లో గుంటూరు, పల్నాడు జేసీలు ఉద్యోగోన్నతిపై కలెక్టర్లుగా వెళ్లారు. ఈ క్రమంలో అప్పటి నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శనివారం జరిగిన బదిలీల్లో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా అమిలినేని భార్గవ్‌తేజ, పల్నాడు జాయింట్ కలెక్టర్‌గా గనోర్ సూరజ్ ధనుంజయ్ నియమితులయ్యారు. 2018 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన భార్గవ్‌తేజ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆయన సర్వీసుని మున్సిపల్ పరిపాలన శాఖ నుంచి ఉపసంహరించి గుంటూరు జేసీగా నియమిస్తూ ఉత్త ర్వులు వెలువరించింది. అనంతపురం జిల్లా కనగాని పల్లె మండలంలోని సోమరవాండ్లపల్లెకు చెందిన భార్గవ తేజ తొలిసారి ఇండియన్ రైల్వేకి, రెండో సారి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌కి ఎంపికయ్యారు. రెవెన్యూ సర్వీసులో శిక్షణలో ఉండగానే మూడో ప్రయత్నంలో అఖిల భారత స్థాయిలో 88వ ర్యాంకు సాధించారు. భార్గవ్‌తేజ కొంతకాలం తూర్పు గోదావరి జిల్లాలో హౌసింగ్ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

పల్నాడుకు రెండో జాయింట్ కలెక్టర్‌గా..

పల్నాడు జిల్లాకు రెండో జాయింట్ కలెక్టర్‌గా గనోర్ సూరజ్ ధనుంజయ్ నియమితులయ్యారు. రామచంద్రాపురం గిరిజన సంక్షేమ ప్రాజెక్టు అధికారిగా ఉన్న ధనుంజయ్ తాజా బదిలీల్లో పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ధనుంజయ్ 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. పల్నాడు జేసీగా ఉన్న శ్యాంప్రసాద్ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఈ నెల 2న బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. సోమవారం ధనుంజయ్ బాధ్యతలు స్వీకరిస్తారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నవీన్

ఏపీసీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా ఎం. నవీన్ నియమితులయ్యారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నవీన్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా జేసీగా ఉన్నారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మికి నవీన్ భర్త అవుతారు.

ఏపీ ట్రాన్స్‌కోకు గుంటూరు కమిషనర్ కీర్తి

గుంటూరు (కార్పొరేషన్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇక్కడకు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న కొత్తమాసు దినేష్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది. 2017 ఐఏఎస్ బ్యాచ్‌లో దినేష్‌కుమార్ ఆరో ర్యాంకు సాధించారు. విజయవాడకు చెందిన ఆయన తొలి పోస్టింగ్‌లో తెనాలి సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అక్కడి నుంచి బదిలీపై నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్‌గా ఆ తర్వాత సత్య సాయి జిల్లా జేసీగా ఒక రోజు, ఆ తర్వాత రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చేశారు. 2022 ఏప్రిల్ నుంచి కమిషనర్‌గా విధుల్లో ఉన్న దినేష్‌కుమార్‌ని తాజా బదిలీల్లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభు త్వం నియమించింది. ఇక గుంటూరు కమిషనర్‌గా ఉన్న కీర్తిని విజయవా డలోని ఏపీ ట్రా న్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

నిధుల రాబట్టేందుకు బాధ్యతలు

ఎంపీల భేటీలో చంద్రబాబు నిర్ణయం

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు మంత్రులు, ఎంపీలను కేంద్ర మంత్రులకు మ్యాపింగ్ చేశారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కూటమి ఎంపీల సమావేశంలో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను సమన్వయం చేసుకుని కార్పొరేట్ వ్యవహారాలకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ప్లానింగ్ శాఖకు సంబంధించి కేంద్రమంత్రి రావు ఇంద్రజీత్‌సింగ్, రాష్ట్ర మంత్రి ఫరూక్‌తో కలిసి మైనార్టీ వ్యవహారాలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో చర్చించి నిధులు రాబడతారు. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణితో సమన్వయం చేసుకుని గిరిజన శాఖకు సంబంధించి కేంద్ర మంత్రి ఓరం, రాష్ట్ర మంత్రి ఫరూక్‌తో సమన్వయం చేసుకుని లా అండ్ జస్టిస్‌కు సంబంధించి కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘావల్‌తో, రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు నివేదించి నిధులు మంజూరుకు కృషి చేస్తారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో సమన్వయం చేసుకుని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని తరచుగా కలుస్తారు. కమ్యూనికేషన్ల అంశాలను మంత్రి లోకేశ్ ద్వారా కేంద్ర మంత్రి పెమ్మసాని తెలుసుకుని నిధుల మంజూరు కోసం కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు నివేదిస్తారు. ఈ విధంగా రాష్ట్ర మంత్రులు, ఎన్‌డీఏ ఎంపీలను కేంద్ర మంత్రులతో మ్యాపింగ్ చేశారు.



గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలతో కలిసి జీజీహెచ్, రైల్వే, ఆర్‌అండ్ బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
- గుంటూరు(తూర్పు)



జిల్లా సరిహద్దు 85/3 వద్ద ప్రవహిస్తున్న సాగర్ జలాలు

జిల్లాకు చేరిన సాగర్‌జలాలు

● ఎస్ఎస్ ట్యాంకులు నింపేందుకే ప్రాధాన్యం

త్రిపురాంతకం, జూలై 20: జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు శనివారం సాయంత్రం జిల్లాకు చేరాయి. జిల్లా సరిహద్దు 85/3 హెడ్ రెగ్యులేటర్ వద్ద శనివారం సాయంత్రానికి 6 అడుగుల లోతుతో 1,402 క్యూసెక్కుల నీరు జిల్లాలోకి ప్రవహిస్తోంది. డీఈఈ విజయలక్ష్మి, ఏఈఈలు శివన్నారాయణ, నీలిమ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేశారని, జలాలు రామతీర్థం జలాశయంతోపాటు అన్ని ఎస్ఎస్ ట్యాంకులు నింపుకునేందుకు అవకాశం ఉందన్నారు. నీటి చౌర్యం జరుగకుండా ఎన్నెస్పీ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు సిబ్బందితో పర్యవేక్షిస్తామన్నారు. కుడి కాల్వకు 4.5 టీఎంసీల నీటిని కేటాయించారని 85/3 నుండి 1.5 నుండి 2 టీఎంసీల నీరు జిల్లాలోకి రావచ్చని అన్నారు.

సొంత జిల్లాకు తహసీల్దార్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20: సాధారణ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ భూపరిపాలన ముఖ్య కమిషనర్(సీసీఎల్ఏ) ఉత్తర్వులు జారీచేశారు. ఒకేస్థానంలో మూడేళ్లకుపైగా పనిచేస్తున్న వారు సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని మూడవ జోన్ పరిధిలోని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగియడంతో బదిలీ అయిన తహసీల్దార్లందరినీ తిరిగి వారి సొంత జిల్లాలకు పంపమని ఎన్నికల ముఖ్య అధికారి(సీఈవో) ఉత్తర్వులు ఇచ్చారు. వీరందరూ కలెక్టర్ ద్వారా పునర్ నియామక ఉత్తర్వులు పొందాల్సి ఉంది. తహసీల్దార్లను వారి సొంత రెవెన్యూ డివిజన్ పరిధిలో నియమించరాదని సీసీఎల్ఏ కలెక్టర్లను ఆదేశించింది. ఈ విషయంలో ఎవరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోకుండా ఇతర డివిజన్లకే వారిని నియమించనున్నారు.

వానకు కూలిన పెంకుటిల్లు

మార్టూరు, జూలై 20 : మండలంలోని వలపర్ల గ్రామంలోని ముస్లిం కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వృద్ధురాలు రిజ్వానాకి చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. రెండురోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు పెంకుల ఇల్లు గోడ పూర్తిగా నానిపోవడంతో ఒక్కసారిగా కూలిపోయింది. అయితే ఈ సమయంలో ఇంటిలో ఉన్న రిజ్వానా, ఆమె కూతురు రహమతున్నీసా తో పాటు ఇద్దరు పసిపిల్లలు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. దాంతో వారు సమీపంలోని బంధువులు ఇంటికి వెళ్లి తలదాచుకున్నారు. పేదరాలైన రిజ్వానాకు ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కూలిపోయిన పెంకుటిల్లు

పవర్ వచ్చినా సంప్రదాయాన్ని వీడని టీడీపీ నేతలు

నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోని మంత్రులు

బదిలీల నుంచి సర్వం ఎమ్మెల్యేలకే అధికారం

జిల్లాస్థాయి వ్యవహారాల్లో సమష్టి నిర్ణయాలు

కలెక్టర్, ఎస్పీల విషయం ముందుగానే చెప్పిన లోకేష్

విద్యుత్ ఎస్ఈ అంశంపై ప్రత్యేక సమీక్ష

అందరి ఆమోదంతోనే జిల్లా అధికారుల నియామకాలు

ఒకటే మాట..!



ప్రతిపక్షంలో ఉండగా ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగారు. ఒంగోలులో మహానాడును నిర్వహించడమే సాహసమైతే దిగ్విజయం చేసి అందరి మన్ననలు పొందారు. ఎక్కడ ఎవరికి సమస్య వచ్చినా అందరూ కలసికట్టుగా నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగారు. తద్వారా ప్రకాశం జిల్లా టీడీపీ నాయకత్వం ఆదర్శంగా పనిచేస్తుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు పదేపదే కితాబిచ్చారు. అయితే అధికారం వచ్చిన తర్వాత కూడా అదేతరహాలో జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ముందడుగు వేస్తున్నారు. అప్పటి వారిలో ఇద్దరు మంత్రులయ్యారు. ఒకరు మినహా మిగిలిన వారంతా ఎమ్మెల్యేలయ్యారు. అయినా ఐక్యత చెక్కు చెదరలేదు. వివాదాస్పద అంశాలపై ఒకటికి రెండుసార్లు సమీక్ష చేసుకొని ఒక్కమాటపై సాగుతుండటం విశేషం. అధికారుల బదిలీల వ్యవహారాల్లో అనుసరిస్తున్న విధానాన్ని చూసి విపక్ష పార్టీ నాయకులు సైతం విస్మయం చెందుతున్నారు. కలెక్టర్, ఎస్పీల నియామకంపై ముందుగానే అధిష్ఠానం జిల్లా మంత్రులకు సమాచారమిచ్చింది. జిల్లాలో అధికారుల బదిలీ విషయానికి వస్తే ఏ నియోజకవర్గ పరిధిలోని అంశాన్ని ఆ ఎమ్మెల్యే, ఇన్‌చార్జులే చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. మేం జోక్యం చేసుకోమని మంత్రులు తేల్చిచెప్పారు. జిల్లాస్థాయి అధికారుల విషయంలో అందరి ఆమోదంతో జాబితా తయారుచేసి తదనుగుణంగా నియమించుకోవాలనే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదనకు మిగిలిన ఎమ్మెల్యేలు జైకొట్టారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో ప్రభుత్వం మారి నెలరోజులు గడిచింది. ఉన్నతస్థాయి బదిలీల పరంపర ఇప్పుడిప్పుడే ముగుస్తుంది. కలెక్టర్, ఎస్పీలాంటి అధికారుల బదిలీల విషయంలో జిల్లా నేతల అభిప్రాయం తీసుకోకపోయినప్పటికీ వారి నియామకం ముందుగా సమాచార ఇచ్చి సంతృప్తిపరుస్తున్నారు. కలెక్టర్, ఎస్పీల బదిలీలు అదేతరహాలో చేశారు. అటు రవికుమార్ ఇటు స్వామికి లోకేష్ ముందుగా ఫోన్‌చేసి కలెక్టర్, ఎస్పీల నియామకం గూర్చి సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం అద్దంకి బాపట్ల జిల్లాలో ఉండటంతో రవికుమార్‌కు అటు బాపట్ల ఇటు ప్రకాశం, స్వామికి ప్రకాశం కలెక్టర్, ఎస్పీల నియామకాల సమాచారం ముందుగానే ఇచ్చారు. కలెక్టర్ నియామక సమాచారంపై మంత్రి స్వామి ఆయనెవరో మాకు తెలియదు. చట్టప్రకారం పనులు చేస్తే చాలు అని స్వామి చెప్పినట్లు తెలిసింది. ఎస్పీ నియామకం రోజు కూడా స్వామికి లోకేష్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది.. మీ అందరికీ తెలిసిన, మీ గురించి తెలిసిన పోలీసు అధికారి దామోదర్‌ను మీకు ఎస్పీగా పంపుతున్నాం. ఏమైన సమస్యలు ఉంటే సాయంత్రంలోపు తెలపండి అని నేరుగా లోకేష్ స్వామికి తెలిపారు. అదేరకంగా బాపట్ల జిల్లా విషయంలో రవికుమార్‌తో మాట్లాడారు. అయితే కలెక్టర్, ఎస్పీల విషయంలో అధిష్ఠానం నిర్ణయంపై కిమ్మనకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించేశారు.

కిందిస్థాయిలో బదిలీలు

ఆ తర్వాత కిందిస్థాయిలో నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులే అధికారులు, ఉద్యోగుల బదిలీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ఇతర నియోజకవర్గాలకు సంబంధించి బదిలీ కోసం మంత్రుల వద్దకు ఎవరైన వెళితే ముందు ఆ ఎమ్మెల్యేను కలిసి రండి, ఆయన అంగీకరిస్తే మేం చెబుతాం అని మంత్రులు స్పష్టం చేస్తున్నారు. ఆ మేరకు ఎమ్మెల్యేలు బదిలీలపై దృష్టిసారించారు. జిల్లా కేంద్రం ఒంగోలులో కీలకమైన మున్సిపల్ కమిషనర్ పోస్టుకు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అనే కొత్త అధికారిని నియమించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిర్ణయం తీసుకున్నారు. ఆర్డీవోగా గతంలో పనిచేసిన విశ్వేశ్వరరావునే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. డీఎస్పీగా రాయపాటి శ్రీనివాసరావుకు, తాలూకా సీఐగా అజయ్‌కు అవకాశం ఇవ్వాలని సిఫార్సు చేశారు. దళిత, బలహీన వర్గాలకు చెందిన ఇద్దరు సీఐలను వన్‌టౌన్, టూటౌన్‌లకు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ల నియామకంపై ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చారు. ఆర్డీవో, డీఎస్పీల విషయంలో కలిసి నిర్ణయం తీసుకోవాలని భావించారు. కనిగిరి డీఎస్పీ విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కొండపి నాయకులు దామచర్ల సత్యలు ఒక నిర్ణయానికి వచ్చారు. ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మార్కాపురం ఆర్డీవో, డీఎస్పీల విషయంపై సమష్టి నిర్ణయం తీసుకునేందుకు మాట్లాడుకుంటున్నారు. అలాగే చీరాల డీఎస్పీ, ఆర్డీవో విషయంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి, కొండయ్యలు ఒకే నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. మార్టూరు సీఐగా శేషగిరిరావును నియమించాలని ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సు చేశారు. దర్శి సీఐగా రామారావు పేరును దామచర్ల సూచించటంతో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఒకే చేశారు. మార్కాపురం సీఐగా సుబ్బారావుకు ఎమ్మెల్యే కందుల సిఫార్సు చేశారు. కంభం సీఐగా ప్రస్తుతం ఉన్నవారికే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి భావిస్తున్నారు. కనిగిరి, పామూరు సీఐలుగా నాయక్, సుబ్బరాజుల పేర్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరిశీలిస్తున్నారు. కనిగిరి డీఎస్పీగా రెడ్డి సామాజిక వర్గం వారే కావాలని డాక్టర్ ఉగ్ర, సత్యలు నిర్ణయించుకొని అధిష్ఠానంకు తెలిపారు.

జిల్లాస్థాయిలో..

జిల్లాస్థాయి అధికారుల నియామకం విషయంలో ఉమ్మడి నిర్ణయానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదాహరణకు విద్యుత్ శాఖ ఎస్ఈ పోస్టుతోపాటు మరో రెండు జిల్లాస్థాయి అధికారుల పోస్టులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ముందుగా సిఫార్సు లెటర్‌పై సంతకం చేసినట్లు చెప్పగానే మిగిలిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు కూడా సంతకాలు చేశారు. డ్వామా పీడీగా అదే సంస్థలో పనిచేస్తున్న రమేష్ అనే అధికారికి బాధ్యతలు ఇవ్వాలనే విషయంలో మాత్రం డైలమా నడుస్తోంది. విద్యుత్ శాఖ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లును నియమించాలని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే ప్రస్తుత ఎస్ఈ మూడు నెలల్లో పదవీ విరమణ చేస్తున్నందున అంతవరకు అవకాశం ఇద్దామని ఒక జిల్లా పార్టీ బాధ్యతలు చూస్తున్న హ్యాట్రిక్ ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిసింది.

వైసీపీ ప్రభుత్వంలో మన ఫోన్లు కూడా చాలామంది అధికారులు లిఫ్ట్ చేయకపోయినా ఈ ఎస్ఈ స్పందించారనే సానుభూతి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అప్పుడె పుడే మంత్రి రవికుమార్ దగ్గర డీఈగా పనిచేసిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈ ఎస్ఈని కొనసాగించడాన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా అనుకుంటున్న వెంకటేశ్వర్లుకు ఇంకా పదోన్నతి రానందున రాగానే అవకాశం ఇవ్వాలా లేక ఇప్పుడే ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇవ్వాలా అనే విషయంపై సమష్టిగా నిర్ణయం తీసుకునే ప్రయత్నంలో ఉన్నారు. డీపీవోగా గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రతిపాదించిన ఓ అధికారి పేరు పరిశీలనకు వచ్చింది. జడ్పీ సీఈవోగా సమర్థవంతుడైన అధికారిని వేయాలనే ఉద్దేశంతో అందరూ పరిశీలన చేస్తున్నారు. ఇలా జిల్లాస్థాయి అధికారుల విషయంలో కూడా ప్రతిపాదనకు వచ్చిన అధికారులపై క్షుణ్ణంగా సమాచారం సేకరించుకొని ఆ తర్వాతే నిర్ణయించుకుంటున్నారు.

చీమకుర్తి సీఐ విషయంలో...

చీమకుర్తి సీఐగా సుబ్బారావును అధిష్ఠానం నేరుగా నిర్ణయం తీసుకోవటంపై అందరిలోను ఆందోళన కనిపించింది. పోలీసు శాఖలో వైసీపీ ప్రభుత్వం పోస్టింగ్ కూడా ఇవ్వకుండా దూరంగా పెట్టిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని భావించారు, అందుకు విరుద్ధంగా చీమకుర్తి సీఐ నియామకం జరిగింది. అయితే అధిష్ఠానం నుంచి పూర్తి సమాచారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ముందుగానే రావటంతో ఆయన సంతృప్తిచెందారు. ఇదేసమయంలో ప్రధానంగా డీఎస్పీలు, ఆర్డీవోల లాంటి అధికారుల నియామకం విషయంలో అధిష్ఠానం ప్రత్యేకంగా పరిశీలిస్తుందనే సంకేతాన్ని ఎమ్మెల్యేలకు ఇచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా లోకేష్ రూపొందించిన రెడ్‌బుక్‌లో ఉన్న వైసీపీ అనుకూల అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వాలనుకుంటే పైన బ్రేక్ పడుతుందనే సంకేతం ఇచ్చారు. అందుకు మంత్రి స్వామిని నానా ఇబ్బందులు పెట్టిన మాతంగి శ్రీనివాసులు అనే సీఐ తుళ్లూరు సర్కిల్ పోస్టింగ్‌కు సిఫార్సు చేయించుకుంటే అధిష్ఠానం వీఆర్‌కు పంపటమే నిదర్శనం. గత ప్రభుత్వంలో మంచి పోస్టుల్లో పని చేసినప్పటికీ ఇప్పుడు వారిని తిరిగి తీసుకోవాలంటే తగిన కారణాలు చూపాలని లోకేష్ ఆఫీస్ నుంచి సమాచారమిచ్చినట్లు తెలిసింది. దీంతో జిల్లాలోని అధికార టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు అధిష్ఠానం సూచనకు అనుగుణంగా జిల్లాస్థాయి అధికారుల విషయంలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని, నియోజకవర్గాల పరిధిలోని అధికారుల బదిలీ విషయాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకోవటం విశేషం. ఈ సమష్టి పోకడను అటు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటు మంత్రి లోకేష్ కూడా అభినందిస్తున్నట్లు తెలుస్తోంది.

వేట మొదలైంది!

బాధితుల ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ

ఆగమేఘాలపై కదిలిన పోలీసులు

ఆకతాయిపై కేసు నమోదు, రౌడీషీట్ కూడా..

గంటల వ్యవధిలోనే భరోసా

ఒంగోలు(క్రైం), జూలై 20: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ రంగంలోకి దిగిపోయారు. బాధితులకు పోలీస్ శాఖ అండగా ఉంటుదని నిరూపించారు. శుక్రవారం మహిళ పోలీసు స్టేషన్ తనిఖీకి వెళ్లిన ఎస్పీ దామోదర్‌కు ఓ బాధితురాలు తన కుటుంబం పడ్డ వేదనను విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన ఎస్పీ ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా తక్షణ చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేయలన్నారు. దీంతో పోలీసులు ఆగమేఘాలపై కేసు నమోదు చేయడమే కాకుండా నిందితుడిని అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నగరంలో వారంరోజుల క్రితం తన పెంపుడుకుక్కను బయట తిప్పడానికి తీసుకొచ్చిన పదేళ్ల బాలికపై ఆకతాయి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అదేసమయంలో బాలిక తల్లిదండ్రులు యువకుడి వెంటపడ్డారు. కొద్దిదూరం పరుగు తీసిన ఆకతాయి దగ్గరలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లి తలదాచుకున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆ ఇంటి తలుపుతట్టి యువకుడి గురించి వాకబు చేశారు. అయితే అతడి స్నేహితుడు బయటకొచ్చి దుర్భాషలాడుతూ బాలిక తండ్రిపై చేయిచేసుకున్నాడు. దీంతో విషయం ఎవరికి చెప్పుకోలేక వారు కుమిలిపోతూ ఉన్నారు. శుక్రవారం మహిళా పోలీసుస్టేషన్ తనిఖీకి ఎస్పీ వచ్చారని తెలుసుకున్న బాలిక తల్లి వెళ్లి తమకు న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు. దీంతో స్పందించిన ఎస్పీ ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. స్థానిక వంటవారి కాలనీకి చెందిన మిట్టల అనిల్‌గా తేల్చి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. గతంలో చైన్‌స్నాచింగ్ కేసు కూడా అనిల్‌పై ఉంది. ఈమేరకు అనిల్‌పై రౌడీషీట్‌ను తెరిచారు.



తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

మహిళలు, చిన్నపిల్లల జోలికొస్తే ఉపేక్షించం

మహిళలు, చిన్నపిల్లలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వారి జోలికొచ్చినా ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్. దామోదర్ హెచ్చరించారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాలికల భద్రతపై దృష్టిపెడతామన్నారు. బాధితులు డయల్ 100 ద్వారా సమాచారం పోలీసులకు తెలియజేయవచ్చునన్నారు.



భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్ వెల్ (ఇన్‌సెట్లో) చెట్ల మధ్య ఉన్న సంప్

ఆర్వో ప్లాంట్‌పై వైసీపీ నిర్లక్ష్యం

● నీరుగారిన రక్షిత నీటి సరఫరా లక్ష్యం ● నాడు టీడీపీ హయాంలో శంకుస్థాపన ● అద్దంకి, బల్లికురవ మండలాల్లోని 21 గ్రామాలకు అందని శుద్ధి జలం ● చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో ఆశలు

అద్దంకి, జూలై 20 : గ్రామీణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరకే శుద్ధ జలాన్ని అందించాలన్న లక్ష్యంతో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన క్లస్టర్ ప్రాతిపదికన నీటి శుద్ధి ప్లాంట్ పనులు పూర్తి కాకుండానే ఆటకెక్కింది. కుప్పం నియోజకవర్గంలో ఈ పథకం విజయవంతం కావడంతో అదే తరహాలో అద్దంకి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం మెగా ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేసింది. అద్దంకి, బల్లికురవ మండలాలలో ఫ్లోరిన్ నీరు ఉండే 21 గ్రామాల ప్రజలకు రక్షిత నీటిని తక్కువ ధరకే అందించాలన్న లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో శింగరకొండ వద్ద 2018 ఫిబ్రవరి 16వ తేదీన అప్పటి కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. భవనాసి ఒడ్డున బోర్లు వేసినప్పటికీ నీటి లభ్యత సరిగ్గా లేకపోవడంతో భవనాసి చెరువు నుంచి నీటిని తీసుకునేందుకు అధికారులు మరలా ఏర్పాట్లు చేసి ఇన్‌టెక్ వెల్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి శింగరకొండలోని శ్రీ కృష్ణదేవరాయ కాపు అన్నదాన సత్రం సమీపంలో ఏర్పాటు చేసిన సంపు వరకు పైప్ లైన్ ఏర్పాటు చేశారు. ఇక శుద్ధి జలం ప్లాంట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసలు పథకం పూర్తిగా అటకెక్కింది. ఆ తరువాత వచ్చిన అధికారులకు సైతం అసలు అలాంటి పథకం నిర్మాణం జరిగిన విషయాన్ని కూడా పూర్తిగా మరిచిపోయారు.

సుమారు 1.50 కోట్ల రూపాయల వ్యయంతో అద్దంకి, బల్లికురవ మండలాలలో 21 గ్రామాలకు 20 లీటర్ల నీటిని 2రూపాయలకే అందించాలన్న లక్ష్యంతో క్లస్టర్ వాటర్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ప్లాంట్ వద్ద నుంచి ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా ట్యాంకర్ లను ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రక్షిత నీటిని అందించాలన్న ఉద్దేశంతో శింగరకొండ వద్ద ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ఆయా గ్రామాలలో ప్రైవేటు వ్యక్తులు ఆర్వో ప్లాంట్‌లను నిర్వహిస్తున్నా నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతోపాటు 20 లీటర్ల నీటి క్యాన్ రూ.10 లేక రూ.20 వరకు అమ్ముతున్నారు. దీంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కుటుంబాలు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయలేక అందుబాటులో ఉన్న ముడి నీటినే తాగుతున్నారు. ఈ పథకం పూర్తయి ఉంటే 21 గ్రామాల ప్రజలకు తక్కువ ధరకే రక్షిత నీరు అంది ఉండేది. వైసీపీ పాలనలో అసలు ఆ పథకాన్నే పట్టించుకోలేదు. దీంతో అది మూననపడి సంప్, ఆర్వో ప్లాంట్‌కే కేటాయించే స్థలం సైతం కొంత ఆక్రమణకు గురైంది. శిలాఫలకం, పంపు చెట్ల మధ్య ఉండిపోయింది. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూలనపడ్డ మెగా ఆర్వో ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, 21 గ్రామాలకు మంచి నీటిని అందించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆ పనులను మంత్రి గొట్టిపాటి వేగవంతంగా పూర్తి చేస్తారని ఆశిస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలి

వైసీపీ హయాంలో అన్నీ అప్పులే

సహకార పాల డెయిరీని పునరుద్ధరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గత ప్రభుత్వంలా చేయొద్దు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 20 : గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా రాష్ట్ర ప్రజల కోసం ప్రస్తుత ప్రభుత్వం పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ సూచించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం, ప్రభుత్వ భూములు, వాణిజ్య సంస్థలపై జగన్ వేలకోట్లు అప్పులు చేశారని ఆయన గుర్తుచేశారు. ప్రతినెలా 1న ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలన్న, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలన్న అప్పు చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. కులాలు, మ తాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని ఆరోపించారు. దీనిని గుర్తించిన ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి 62 సీట్లు కోతపెట్టారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్ ఎన్‌డీఏ కూటమిలో కలవకపోతే దేశ రాజకీయాలు మరోలా ఉండేవన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కేవలం అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డికి భయపడే ఎన్‌డీఏలో చేరారన్నారు. మోదీ ఇప్పటికే దేశసంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారని ఆరోపించారు. పేదలకు అండగా ఉండేది కమ్యూనిస్టు పార్టీలేనని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభావం తగ్గుతుందన్నారు. రాజ్యసభలోనూ బలం లేదని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో ఇండియా కూటమి సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఫలితాలు మరో రకంగా ఉండేవని ఆయన పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణలు మాట్లాడుతూ జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయడంతో పాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.వెంకట్రావు, ఆదే నారసయ్య, సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్‌చౌదరి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయ తదితరులు ఉన్నారు.



ఒంగోలు డెయిరీలో యంత్రాలను పరిశీలిస్తున్న రామకృష్ణ, నేతలు

ప్రభుత్వ ఆధీనంలోనే పాలకేంద్రాన్ని నిర్వహించాలి

వైసీపీ ప్రభుత్వంలో అమూల్ సంస్థకు ఒంగోలు పాలకేంద్రాన్ని ఇచ్చిందని, దానిని వెంటనే రద్దు చేసి ప్రభుత్వ ఆధీనంలోనే పాల డెయిరీని నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. శనివారం మధ్యాహ్నం పాలకేంద్రాన్ని సందర్శించారు. ప్రకాశం జిల్లా పాడిరైతులకు ఉపయుక్తంగా ఉండే సహకార డెయిరీని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జిల్లాలోని లక్షలాది మంది ఆ డెయిరీపై ఆధారపడి ఉన్నారని, అందువల్ల ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిసి వివరిస్తామని రామకృష్ణ తెలిపారు. రామకృష్ణ వెంట నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, ఎంఎల్ నారాయణ, వెంకట్రావు, పివిఆర్ చౌదరి తదితరులు ఉన్నారు.

25న సర్వసభ్య సమావేశం

పర్చూరు, జూలై 20 : పర్చూరు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యాక్రమాల మీద నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

బాధితుల ఫిర్యాదుపై కేసు

పర్చూరు, జూలై 20 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పర్చూరు - చీరాల రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సమీపంలో జీపును కారు ఢీకొట్టింది. ఈసంఘటనలో జీపులో ఉన్న కారు డ్రైవర్‌తోపాటు, అతని ఇద్దరు ఇన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పర్చూరు పోలీసులు తెలిపారు.

వాగులో చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు

రూ.37.300లక్షలతో నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పర్చూరు, జూలై 20 : వాగును కమ్మేసిన చిల్లచెట్లు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. చిల్ల చెట్లను తొలగించేందుకు రూ.37.300లక్షల అంచనాలతో శనివారం నివేదిక పంపినట్లు డ్రైనేజ్ స బ్ డివిజన్ సహాయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు. పర్చూరు వాగులో చిల్లచెట్లు ముళ్లపొదలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. కొద్దిపాటి వరదలు వచ్చినా సమీపంలోని వేల ఎకరాల్లో పంట భూములు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ఏళ్ల తరబడి వాగును అభివృద్ధి చేయకపోవడంవల్ల నీటి ప్రవా హం లేక ఆధ్వానంగా తయారైంది. అదే వాగులో నీటిని ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి చెరువులకు నింపుకుంటున్నారు. ఈతరుణంలో వాగు పరిస్థితిపై శుక్రవారం వార్త వచ్చింది.

వసతి గృహాలు లేక విద్యార్థినుల ఇక్కట్లు

- అద్దె భవనంలో కొనసాగుతుందని ఎనిదేళ్ల కిందట రద్దు
- మంత్రులపైనే ఆశలు

అద్దంకి, జూలై 20 : దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కొన్ని చిన్న విషయాలలో నిర్లక్ష్యం కారణంగా ఫలాలు అందని పరిస్థితి నెలకొంది. అద్దంకి నియోజకవర్గంలో ఎస్సీ జనాభా ఎక్కువ గానే ఉంది. నియోజకవర్గం మొత్తం మీద కనీసం ఒక్క బాలికల వసతి గృహం కూడా లేకపోవడం దురదృష్టమనే చెప్పాలి. నియోజకవర్గంలో 8 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉండగా, వాటిలో అద్దంకి పట్టణంలో రెండు బాలుర, ఒకటి కళాశాల బాలురు, ఒకటి కళాశాల బాలికల వసతి గృహాలు, పమిడిపాడు, ముప్పవరం, వైదన, సంతమాగులూరులలో బాలుర వసతిగృహాలు ఉన్నాయి. అద్దంకి పట్టణంలో దశాబ్దాల నుంచి ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తుందన్న కారణంతో 8ఏళ్ల కిందట రద్దు చేశారు. అప్పట్లో 140 మంది విద్యార్థినులు పోతురాజుగండి వద్ద ఉన్న అద్దె భవనంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో ఉన్నారు. అప్పట్లో రద్దు చేయడంతో విద్యార్థినుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి మరలా బాలికల వసతి గృహం ఏర్పాటు చేయలేదు. దీంతో నియోజకవర్గంలో ఉన్న విద్యార్థినులు దూరప్రాంతాలకు వెళ్లాల్సిరావడంతో ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు దూరప్రాంతాలకు పంపించలేక అర్థాంతరంగా చదువులు మానివేస్తున్నట్లు కూడా తెలుస్తుంది. బల్లికురవ మండలంలో ఒకే ఒక హాస్టల్ వైదనలో ఉంది. అదీ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థినులు చేరక ఈ ఏడాది మూత పడింది. దాని స్థానంలో మండల కేంద్రమైన బల్లికురవలో సాంఘిక సంక్షేమ బాలుర లేదా బాలికల వసతి గృహం ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం ఉంది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న అద్దంకిలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని పునరుద్ధరించడం ద్వారా ఉపయోగమని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అద్దంకి పట్టణంలో ఎస్సీ బాలుర వసతి గృహాలు రెండు సొంత భవనాలలో నడుస్తున్నాయి. వాటిలో ఒక దానిని అద్దె భవనంలోకి మార్చి బాలికల వసతిగృహానికి కేటాయించాలని, అలా కాని పక్షంలో అద్దె భవనంలోనైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాది నుంచే అద్దంకి, బల్లికురవలో సాంఘిక బాలికల వసతిగృహాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎస్సీ బాలికలు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



మెప్మా సీఎంఎం ఫణికుమారి, ఆర్‌పీలను విచారిస్తున్న ఆర్డీవో

విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహిళా మార్ట్ నిధుల దుర్వినియోగంపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూలై 20 : మహిళా మార్ట్ నిధులు దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. అద్దంకిలోని జగనన్న మహిళామార్ట్ నిధులు దుర్వినియోగంపై ఆంధ్రజ్యోతిలో పలు మార్లు కథనాలు ప్రచురితం కావడం, మెప్మా సభ్యులు ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఇతర అధికారులతో కలిసి స్థానిక మెప్మా కార్యాలయం లో విచారణ చేశారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్ పెట్టుబడి, నిర్వహణ ఇతర అంశాలతో పాటు అవినీతి ఆరోపణలపై మెప్మా సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మార్ట్ నిర్వహణపై సీఎంఎం ఫణికుమారి జమా, ఖర్చులు వివరించగా, అందులో చోటు చేసుకున్న పలు అవకతవకలను పలువురు ఆర్‌పీలు ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. మహిళా మార్ట్ మూసివేసే సమయంలో ఉన్న స్టాకు కంటే అనంతరం బ్యాంక్ ఖాతాలోకి అదనంగా డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మరోసారి పూర్తి స్థాయి విచారణ చేపడతామని, రికార్డులు అందుబాటులో ఉంచాలన్నారు. అవకతవకలు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. మునిసిపల్ కమిషనర్ సత్యనారాయణ, డీసీవో శ్యాంసన్ పాల్గొన్నారు.



రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నాగరాజుపల్లి ఫారెస్ట్ భూమి పరిశీలన

మార్టూరు, జూలై 20 : మండలంలోని నాగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఎర్రమట్టిని తవ్విన వారిపై కేసులు పెడతామని, మట్టిని రవాణా చేయడానికి వచ్చిన వాహనాలను సీజ్ చేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్ హెచ్చరించారు. శనివారం ఫారెస్ట్ అధికారులు నాగరాజుపల్లిలోని రిజర్వ్‌ఫారెస్ట్ ఏరియాను పరిశీలించారు. అక్కడ మట్టిని తరలించడానికి వచ్చిన వ్యక్తులకు ఈ రిజర్వ్‌ఫారెస్ట్‌లో మట్టిని తవ్వడానికి ఎవరికీ అనుమతి లేదని అధికారులు వారికి తెలిపారు. అటవీ శాఖ నిబంధనలు ప్రకారం అటవీ భూములలో మట్టి తవ్వకాలకు అనుమతి లేదన్నారు. ఒక వేళ ఎవరైనా అటవీ నిబంధనలను అతిక్రమిస్తే రవాణా కోసం వచ్చే వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ వై.జాన్సన్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, హిదయతుల్లా పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోవాలి

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బ్యాంక్ మేనేజర్, ఉద్యోగులు

అద్దంకిటౌన్, జూలై 20 : అద్దంకి, ఇతర ప్రాంతాల ప్రజలు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అందించే వివిధ రకాల పథకాలను, సేవలను వినియోగించుకోవాలని అద్దంకి బ్రాంచి మేనేజర్ ఏ.మురళీకృష్ణ అన్నారు. శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ వ్యవస్థాపకుడు సాయాజీరావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని గురకాయపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బ్యాంక్ మేనేజర్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

మేదరమెట్ల, జూలై 20 : గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో సమతావాణి ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఆరోగ్య శాఖ సహకారంతో డయేరియా, ఇతర వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డేని పాటించి, ఎక్కడా చెత్తలు, మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

మార్టూరు, జూలై 20 : ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 24 బుధవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జీ నితిన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహిస్తారని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

అడుగంటిన అంబడిపూడి చెరువు

- ఆరు గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా
- అవస్థలు పడుతున్న ప్రజలు



అంబడిపూడి చెరువులో అడుగంటిన నీరు

బల్లికురవ, జూలై 20 : మండలంలోని అంబడిపూడి రక్షిత నీటి పథకం స్టోరేజ్ చెరువులో నీరు అడుగంటింది. గత వారం రోజుల నుంచి ఈ చెరువు ద్వారా తాగు నీరు అందే ఆరు గ్రామాలకు పూర్తిస్థాయిలో నీటి విడుదల నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాగర్ నీరు వచ్చే వరకూ తాగునీరు అందే పరిస్థితి లేదని తక్షణమే సాగర్ నీరు రాగానే చెరువును పూర్తి స్థాయిలో నింపాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో ప్రభుత్వ సీపీడబ్ల్యూ పథకంలో పెద అంబడిపూడి, చినఅంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలకు ఫ్లోరిన్ లేని శుద్ధి జలాన్ని అందించేలా ప్రభుత్వం రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈ పథకం పని చేయకుంటే గ్రామాలలో నీటి ఎద్దడి వస్తుంది. ప్రతి ఏటా ఈ చెరువును అధికారులు ప్రణాళిక మేరకు నింపుతారు. ఈ ఏడాది మాత్రం అరకొరగా చెరువుకు నీటిని పెట్టడంతో ఇప్పుడు అది అడుగంటి పైపు లైన్‌కు అందడంలేదు. దీంతో వారం నుంచి ఆరు గ్రామాలకు మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు నీరు అందక పొరుగు గ్రామాలకు పరుగులు పెడుతున్నారు. కొందరు ఆర్వో ప్లాంట్ల వద్దకు బారులు తీరుతున్నారు. ఆరు గ్రామాలకు నిరంతరం అందించే నీటి పథకం ఇప్పుడు పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ డ్యాం నుంచి మంచి నీటి అవసరాలకు కోసం నీటి విడుదల జరిగిందని అధికారులు వెంటనే అంబడిపూడి చెరువును పూర్తిస్థాయిలో నింపే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బడికెలా రావాలి..?

రాంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మొర



మరో రోడ్డులో చిల్లచెట్లతో ఉన్న రోడ్డు



స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి

ఇంకొల్లు, జూలై 20 : సార్ మేము పాఠశాలకు ఎలా రావాలి.. చిన్నపాటి వర్షం పడితే రాలేకపోతున్నాం. రావాలంటే భయమేస్తుంది.. ఇదీ ఇంకొల్లులో కడవకుదురు కాలనీ సమీపంలోని రాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆవేదన. ఈ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద గుంతలు పడి చిన్నపాటి వానకే పిల్లలు బడికి పోలేని పరిస్థితి ఉంది. స్కూల్‌కు వెళ్లేందుకు మరో రోడ్డు ఉంటే అదేమో చిల్ల చెట్లతో మూసుకుపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి. మరో రోడ్డులో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులు పెరిగిన చిల్ల చెట్లతో అడ్డంకులు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్‌కు వేళ్లేందుకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి సమస్యను అధికారులు పట్టించుకొని ఆ చిన్నారులు ప్రశాంతంగా బడికి పోయేలా చర్యలు తీసుకోవాలి.

చినుకు పడితే.. మినీ బైపాస్ బురదే..!



బురద మయంగా అద్దంకిలోని మినీ బైపాస్

అద్దంకిటౌన్, జూలై 20 : ఈ బురద రోడ్డును చూసి ఇది ఏదో గ్రామంలోని, గ్రామాలకు వెళ్లే అడ్డ రోడ్డు అనుకుంటే పొరపాటే. అద్దంకి మున్సిపాలిటీలోని మినీ బైపాస్‌గా చెప్పుకునే కాలువ కట్ట రోడ్డు. చినుక పడితే ఆ రోడ్డు వరి నారు మడిని తలపిస్తుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయంలో ఆ రోడ్డుకు గ్రావెల్, కంకర వంటి వి పోసి అభివృద్ధి చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ రోడ్డు అభివృద్ధిని గాలికొదిలేసింది. దీంతో గ్రావెల్, కంకర వంటివి లేకుండా కుంటలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చినుక పడితే ఆ రోడ్డు అంతా బురద మయంగా మారి కనీసం పాదచారులు కూడా నడిచేందుకు వీలు లేకుండా మారింది. ఇప్పటికైనా సంబంధిత మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టి మినీ బైపాస్‌గా పిలువడే ఈ కాలువ కట్ట రోడ్డును అభివృద్ధి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.



గ్యాస్ పొయ్యిని అందజేస్తున్న రోటరీ సభ్యులు

పాఠశాలకు గ్యాస్ స్టౌవ్, వంట సామగ్రి వితరణ

అద్దంకిటౌన్, జూలై 20 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ స్టౌవ్, వంట సామగ్రిని అందజేశారు. కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాలలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆర్థిక సాయంతో స్టౌవ్, వంట పాత్రలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్నిమురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గొనసపూడిలో ధనిక్ భారత్‌పై చర్చ

చినగంజాం, జూలై 20 : మండలంలోని గొనసపూడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ధనిక్ భారత్ అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ధనిక్ భారత్ మిషన్ నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు ఆధ్వర్యంలో చర్చావేదిక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవినీతి, నల్లధనం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. నిపుణులు, మేధావులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టోల్‌ప్లాజా కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

మార్టూరు, జూలై 20 : బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పనిచేసున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసనకు దిగారు. వారికి మద్దతుగా సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, ఉద్యోగుల యూనియన్ నాయకుడు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నామన్నారు. నేటికీ తమకు జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ ప్లాజా కంపెనీ పరిధిలో కాకుండా కాంట్రాక్టర్ పరిధిలో పనిచేస్తుండడంతో తమకు గుర్తింపు లేదని, సరైన వేతనాలు లేవని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, జూలై 20 : వర్షాల కారణంగా పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వద్దని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. పురలపాలక సంఘ పరిధిలోని పలు డ్రైన్‌లు, చెత్త సేకరణ ప్రదేశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. స్వర్ణ రోడ్డు, పోలేరమ్మ గుడి, గడియార స్తంభం, మసీదు సెంటర్, ముక్కోణం పార్క్, దండుబాట ప్రాంతాలను సుదీర్ఘంగా పరిశీలించారు. పురపాలక సంఘం పరిధిలో ఎక్కడా వర్షపు నిల్వలు, మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు పారుదల ఉండేలా చూడాలన్నారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని వివరించారు. కమిషనర్‌తో పాటు శానిటేషన్, వార్డు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

విద్యా వ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పంగులూరు, జూలై 20 : విద్యార్థి లేకుండా విద్యా వ్యవస్థ లేదని, దానికి కేంద్ర బిందువు విద్యార్థి అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలలో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన వారితో పాటు 2023లో జరిగిన ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థుల అభినందన సభ శనివారం పంగులూరు ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు సమాజంలో అణచివేతకు గురైనవర్గాల వారని, ఉపాధ్యాయులు వారి పట్ల ఆప్యాయతతో ఉండాలన్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన విద్యార్థులకు కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సమకూర్చిన శంకరనారాయణ డిక్షనరీలతో పాటు రూ.1000 నగదును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నాగభూషణం, జీ.వీరాంజనేయులు, విశ్రాంత ప్రొఫెసర్ వీరనారాయణ, పాఠశాల హెచ్‌ఎంలు రమాదేవి, అణిత, బంగారుకొండ, గోవిందరాజులు, గిరిజ, హనుమంతరావు, వడ్లవల్లి వీరనారాయణ, మేటీఎఫ్ ప్రతినిధులు చెంచయ్య, శ్రీనివాసరావు, నరసింహారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. చందలూరు పాఠశాల విద్యార్థిని శ్రుతి యోగాసనాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమాచార హక్కుతో జవాబుదారీతనం





బల్లికురవలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర... మార్టూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

బల్లికురవ, జూలై 20 : సమాజంలో ప్రజలకు ప్రభుత్వానికి సమాచార హక్కు చట్టం ద్వారా జావాబుదారీతనం పెరుగుతుందని తహసీల్దార్ సుభద్ర అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి అధ్యక్షతన రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతు నిబంధనల మేరకు ఎవరైనా సమాచారాన్ని పొందే వీలు ఉందన్నారు. ప్రజలకు అడిగిన సమాచారాన్ని సకాలంలో ఇవ్వకుంటే చర్యలు తప్పవని సుభద్ర హెచ్చరించారు. సదస్సులో ఎంపీడీవో హనుమారెడ్డి, సీడీపీవో సుధ, ఈవోపీఆర్డీ సుమతి, ఏఈలు హనుమంతురావు, రామాంజనేయులు, కిషోర్‌బాబు ఎంఈవో రమేష్, రిసోర్సు పర్సన్ అనిల్ పాల్గొన్నారు.

పంగులూరు : పౌరులు కోరిన సమాచారాన్ని 30 రోజులలోగా అందిచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ, వెలుగు, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు) : సమాచార హక్కు చట్టంపై శనివారం కారంచేడు మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. సమాచార హక్కు చట్టం ఏవిధంగా ఉపయోగపడుతుందో ఏవో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.సుశీలాదేవి, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏపీవో లక్ష్మీనారాయణ, విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.హిమబిందు, కె.సునీత పాల్గొన్నారు.

మార్టూరు : ప్రభుత్వ ఉద్యోగులు సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ అన్నా రు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమాచారహక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల నుంచి పనులకు సంబంధించిన సమాచారాన్ని పొందే హ క్కు అందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో స హాయ వ్యవసాయ సంచాలకులు వి. శ్రీనివాసరావు, ఎంఈవో వస్రాంనాయక్, ఈవోపీఆర్డీ సు బ్బారావు, ఏపీఎం, కార్యదర్శులు పాల్గొన్నారు.

యద్దనపూడి : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. శనివారం యద్దనపూడిలోని స్త్రీశక్తి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయఅధికారి సీహెచ్ ఆదినారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, డీటీ మస్తానరావు, అధికారులు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతినేని వేణుగోపాల్, ఎంఈవో శ్రీనివాసరావు, ఏపీవో రేణుక, ఏపీఎం మోహనరావు, ఏఎస్‌వో పుష్పలత, కార్యద ర్శులు, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

చినగంజాం : సమాచార హక్కు చట్టం పారదర్శకతకు నిదర్శనమని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, ఏవో కే.భాస్కరరావు అన్నారు. ఎంపీడీవో సమావేశ హా లులో అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో 1, 2 బి.అజయ్‌బాబు, కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ దాసు, టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలన్నింటి కార్యాకలాపాల గురించి తెలుసుకునే హక్కు పౌరులందరికీ ఉందని ఎంపీడీవో సమతావాణి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. అడిగిన సమాచారాన్ని నిర్దిష్ట సమయానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుశీల, సీడీపీవో కృష్ణకుమారి, ఎంఈవో పున్నయ్య, ఏవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ ఓబులేసు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీ కమిషనర్‌గా సూర్యతేజ

- పార్వతీపురం ఐటీడీఏ పీవోగా జేసీ సేతుమాధవన్ బదిలీ


నూతన కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జూలై 20 : నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మల్లవరపు సూర్యతేజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా కేఆర్‌పురం (కర్నపురం) ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్నారు. ఇక జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న సేతుమాధవన్‌ను పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమించారు. కాగ నెల్లూరుకు ఎవరినీ జేసీగా నియమించలేదు. ఈ నెల 5న నెల్లూరు కమిషనర్ వికాస్‌మర్మత్‌ను కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థకు పీవోగా నియమించిన సంగతి తెలిసిందే.

మనోళ్లు వచ్చేశారు!

- ఎన్నికల విధుల కోసం పొరుగు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు వెనక్కి
- అనుకూల ప్రాంతాల కోసం సిఫారసు
- నేతల చుట్టూ ప్రదక్షిణలు

నెల్లూరు (హరనాథపురం), జూలై 20 : ఎన్నికల విధుల కోసం పొరుగు జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను వారి సొంత జిల్లాలకు కేటాయిస్తూ సీసీఎల్ఏ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై వెళ్లిన వారు అక్కడ నుంచి రిలీవ్ అయి కలెక్టర్‌కు రిపోర్టు చేయనున్నారు. ఆ తర్వాత ఆ అధికారులకు మండలాలు, కలెక్టరేట్, డివిజన్ కార్యాలయాల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. అయితే వారిని సొంత రెవెన్యూ డివిజన్లలో మాత్రం పోస్టింగ్ ఇవ్వొద్దని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి 31న జిల్లాలోని 42 మంది తహసీల్దార్లు జోన్-3 పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ జూన్ 6న ముగిసింది. అయితే ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు రాకపోవటంతో వారిని సొంత జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై తహసీల్దార్లతోపాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు కూడా రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించి ఆదేశాలు ఇవ్వటంతో శనివారం సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఇతర జిల్లాలకు వెళ్లిన 42 మంది తహసీల్దార్లు శనివారం ఆయా జిల్లాల్లో రిలీవ్ అయ్యారు.

అనుకూల పోస్టింగ్ కోసం..

బదిలీపై తిరిగి సొంత జిల్లాకు వస్తున్న తహసీల్దార్లకు గతంలో పనిచేసిన డివి జన్లలో పోస్టింగ్ ఇవ్వరు. దీంతో వారంతా రాజకీయ నేతలను ఆశ్రయించి అనుకూల ప్రదేశాల కోసం సిఫారసు చేయించుకుంటున్నట్లు తెలిసింది. ఈ సిఫారసులు, పరిశీలన అనంతరం నాలుగైదు రోజుల్లో తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

'నామినేటెడ్' హుషారు!

- ఆగస్టులో పోస్టుల భర్తీకి కసరత్తు
- అర్హుల జాబితా కోరిన టీడీపీ అధిష్ఠానం

సాధ్యమైనంత వేగంగా నామినేటెడ్ పోస్టులు భర్తీకి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కొద్ది రోజుల్లోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా నాయకత్వానికి సంకేతాలు అందాయి. ఆగష్టులో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యం చేసింది. అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తరువాత కొన్ని కీలక పోస్టులను భర్తీ చేయగా, 2019 ఎన్నికలకు ముందు భర్తీ చేసిన పోస్టులు చాలా ఉన్నాయి. దీంతో ముఖ్య నాయకులు తీవ్ర నిరాశ నిస్పృహకు గురయ్యారు. ఆ ప్రభావం 2019 ఎన్నికలల్లో కనిపించింది. ఆ తప్పిదాన్ని మరోసారి చేయకూడదని నిర్ణయించుకున్న కూటమి ప్రభుత్వం సాధ్యమైనంత వేగంగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించుకుంది. వెంటనే పోస్టుల భర్తీ చేపడితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీకి పనిచేసిన చాలా మంది నాయకులకు న్యాయం చేసినట్లు అవుతుందని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టులో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైన నాయకుల జాబితాను అధిష్ఠానానికి పంపాలని జిల్లా నాయకులకు సంకేతాలు అందాయి. దీంతో జిల్లాలో నామినేటెడ్ పోస్టుల సందడి నెలకొంది.

జిల్లాకు సముచిత న్యాయం

ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో విజయం సాధించిపెట్టిన ఉమ్మడి జిల్లాకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత న్యాయం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కొందరు నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్ పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. నుడా, డీసీసీబీ, సీడీఎంఎస్ వంటి కీలకమైన పదవులతోపాటు ముఖ్యమైన ఆలయాల పాలకమండళ్లలో నాయకులను కొలువుదీర్చనున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన కుల కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం కొత్త జీవం పోయనున్నట్లు సమాచారం. బీసీ, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల పాలకమండళ్ళు కూడా కీలకం కానున్నాయి. వీటి భర్తీ ద్వారా వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకులకు సముచిత స్థానం కల్పించనున్నారు. ఇక రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులకు అర్హులైన నాయకులు జిల్లాలో పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పార్టీ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే టిక్కెట్లను త్యాగం చేసినవారూ ఉన్నారు. వీరిలో ఒకరిద్దరికి ఎమ్మెల్సీలుగా, మరి కొంతమందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో ద్వారా న్యాయం చేసే విషయాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

గొప్పగా జీవించడం అంటే ఏమీ లేదు. జీవించి ఉండటమే గొప్పగా జీవించి ఉండటం..!

- అన్నారు ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి


ఫెయిల్యూర్ ఈజ్ ఏ పార్ట్ ఆఫ్ లైఫ్. ఇఫ్ యూ డోన్ట్ ఫెయిల్. యూ డోన్ట్ లర్న్. ఇఫ్ యూ డోన్ట్ లర్న్. యూ విల్ నెవర్ ఛేంజ్.

- అన్నారు మానసిక తత్వవేత్త జెన్నిఫర్ లోఫెజ్

ఈ రోజు నిన్ను తీవ్రంగా భయపెట్టే సమస్య. కొంతకాలం తరువాత అది నీకు చాలా చిన్నదిగా కనిపిస్తుంది. ఇంత చిన్న విషయానికా అంతగా నేను భయపడ్డాను. అని నిన్ను నువ్వు నవ్వుకునేలా చేస్తుంది. అయితే ఆ కొంతకాలం వేచి చూసే ధైర్యం, ఓపిక సమాజంలో కొరవడుతుండటమే బాధాకరం.

అన్నీ తెలిసిన మనిషిని ఏదో ఒక అంశమో, విషయమో.. భయమో... మోహమో... మింగేస్తుంది. ఇలా 2023లో జిల్లావ్యాప్తంగా 543 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో 20 మంది రైళ్ల కింద పడి ఆత్మహత్య చేసుకోగా, 524 మంది వివిధ పద్ధతుల్లో ప్రాణాలు తీసుకున్నారు.

SUNDAY SPECIAL



నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 12.4 మందికి పెరిగిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితులకు దారితీస్తున్న అంశాలేమిటి అనే చర్చ ఇపుడు దేశవ్యాప్తంగా మొదలైంది. అయితే.. మానసిక ఒత్తిడే దీనికి ప్రధాన కారణమని ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు.

క్షణికావేశం వద్దు... ఒక్క క్షణం ఆలోచిద్దాం!

- సమస్యలను జయిద్దాం.. సుఖంగా జీవిద్దాం !
- జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు
- 2023తో 500లకుపైగా బలవన్మరణాలు
- జీవితంలో పోరాడుతూ విజేతగా నిలవాలి
- మీరు లేకుంటే మీవాళ్ల స్థితి ఏమిటో అర్థం చేసుకోండి

సకల ప్రాణకోటిలో అత్యున్నతమైన మానవుడే చిన్న చిన్న కారణాలకు బలవన్మరణాలకు పూనుకొంటున్నారు. చావు ఒక్కటే సమస్యకు పరిష్కారంగా ఎంచుకొంటున్నాడు. విచ్ఛిన్నమైన ఉమ్మడి కుటుంబాలు, కనుమరుగవుతున్న స్నేహసంబంధాలు.. మనుషులను బలవన్మరణాల వైపు నడిపిస్తున్నాయి. విశేషమేమంటే దశాబ్దం క్రితం ప్రేమ వైఫల్యాలు, చదువు విషయాల్లో యువకులే ఎక్కువ శాతం మంది ఆత్మహత్యలు చేసుకునే వారు. ఇప్పుడు అవసరానికి మించిన ఖర్చులు, ఆడంబర జీవితాల కారణంగా ఎదురయ్యే ఆర్థిక సమస్యలు నడివయస్కులను మింగేస్తున్నాయి. సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, పరిష్కారం కోసం కొంత సమయం ఎదురుచూసే ధైర్యం లేక ఉరితాళ్లకు వేలాడుతున్నారు. ఇటీవల మరో కొత్త రుగ్మత ప్రారంభమైంది. మరణం తరువాత తను చూడని, తనకు తెలియని సానుభూతి కోసం ఆత్మహత్యలు చేసుకునే దృశ్యాలను మొబైల్‌లో రికార్డు చేస్తున్నారు.

ఓ ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబపరిస్థితి అధ్వానంగా మారుతుంది. అప్పటివరకు తలుపుల చాటున ఇంటి పనులు చూసుకునే భార్యకు భర్త మృతి తర్వాత సమాజంలో ఏవిధంగా ముందుకు అడుగులు వేయాలో అర్థం కాక కన్నీరు కార్చని క్షణం ఉండదు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబంలో నెలకొనే విషాదం వర్ణనాతీతం. ఏదైనా సమస్య పరిష్కారం కోసం ఆత్మహత్యే మార్గమా.. ఆత్మహత్యతో సమస్యలు పరిష్కారం అయిపోతాయా అని ఒక్క క్షణం ఆలోచించాలి. ఎదురైన సమస్యను ఆప్తులకు చెప్పుకోవడం ద్వారా ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన నుంచి బయట పడగలమని నిపుణులు చెబుతున్నారు.

వ్యాధులు తగ్గి.. రుగ్మతలు పెరిగి...

పెరిగిన వైద్య సదుపాయాల క్రమంలో మనిషి మరణాన్ని శాసించే భయంకర వ్యాధులు తోకముడుచుకున్నాయి. ఒకప్పుడు ఊళ్లకు ఊళ్లు మింగేసిన ప్లేగు, కలరా వంటి వ్యాధులు ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. అంతే భయంకరమైన అంటువ్యాధి టీబీ ప్రభావం పూర్తిగా కట్టడి చేశాం. ప్రపంచాన్ని వణికించిన హెచ్‌ఐవీ భూతం ఎటుపోయిందో తెలియడం లేదు. మొన్నటి మొన్న కొత్తగా పుట్టుకొచ్చిన కరోనా వైరస్‌నూ జయించాం. ఇలా మనుషుల ప్రాణాలను హరించే వ్యాధులు కట్టడి అవుతున్నాయి కానీ, బలవంతంగా ప్రాణాలు తీసుకునే మానసిక బలహీనతలు, రుగ్మతలు మాత్రం క్రమక్రమంగా పెరిగిపోతున్నాయి.

పెరుగుతున్న ఒంటరితనం

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్న సమయంలో ఒకరి బాధలను మరొకరు పంచుకునేవారు. దీంతో సమస్యలకు పరిష్కారం దొరకడం తో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉండేది కాదు. ఇప్పటిరోజుల్లో ఇంట్లో భార్య, భర్త, పిల్లలు మాత్రమే ఉంటున్నారు. కుటుంబ కలహాలు తలెత్తినప్పుడు మరొకరితో తమ బాధలు చెప్పుకోలేక వారిలో వారే కుంగిపోతూ ఆత్మహత్యవైపు అడుగులు వేస్తున్నారు. ఈ రోజుల్లో కుటుంబమంతా ఒకే దగ్గర కూర్చొని అరగంట కూడా మాట్లాడుకోవడం లేదు. అదేమిటంటే సమయం లేదు బిజీ అంటుంటారు. ఎదురైన సమస్యను పోరాడి పరిష్కరించుకోవాలే తప్ప సమస్య నుంచి తప్పించుకు నేందుకు ప్రాణాలను విడవాలనుకోవడం సరైన నిర్ణయం కాదు.

- నెల్లూరు (క్రైం)

ఇలా ఎదుర్కోండి!

- ధైర్యం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలతో భవిష్యత్తును చక్కగా ఊహించుకోవాలి.
- ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచుతూ కుటుంబ సభ్యులంతా వారిలో ధైర్యం నింపాలి.
- సాధారణంగా ఆత్మహత్య భావన ఉన్నవారు చావు గురించి మాట్లాడటం, డైరీ, ఇతర పుస్తకాల్లో ఎలా చావాలో వంటి అంశాలను రాస్తుంటారు. వాటిని గమనిస్తూ ఉండాలి
- ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింక్ పుస్తకాలు, బిహేవియర్ థెరిఫీ, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడతాయి.
- వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్న వారికి ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి.



అవగాహన సదస్సులతో ప్రయోజనం

ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో యువకుల నుంచి వృద్ధుల వరకే ఎక్కువగా ఉంటున్నారు. ప్రధానంగా మానసిక ఒత్తిడితోనే ఈ దారుణానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వంతో పాటు సామాజికవేత్తలు, పత్రికలు, సమాజసేవకులు, స్వచ్ఛందసంస్థలు, లాయర్లు, డాక్టర్లు ఇలా అన్ని వర్గాల వారు ఆత్మహత్యలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకురావచ్చు. ఓ వ్యక్తి మరణం వల్ల ఆ కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అవుతుంది. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం అనుకుంటారే కానీ ఎన్నో సమస్యలకు పునాది అని ఎవరూ భావించడం లేదు.

- ఈదూరు భాస్కరయ్య, న్యాయవాది, నెల్లూరు



సమస్యకు చావు పరిష్కారం కాదు

జిల్లాలో ఎక్కువగా ఆత్మహత్యలు చూస్తున్నాము. చిన్న చిన్న విషయాలకూ ఎంతోమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇలాంటి కేసుల్లో విచారణ చేసిన తర్వాత అసలు ఆత్మహత్య చేసుకునేంత పెద్ద సమస్యలు కనిపించడం లేదు. రోజూ ఇలాంటి ఘటనలు చూస్తూనే ఉన్నాము. ఆత్మహత్యలపై అవగాహన సదస్సులను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆలోచించండి, సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదు.

- డీ శ్రీనివాసులరెడ్డి, నగర డీఎస్పీ

కొత్త కోరికలతో..

- నాల్గవ రోజూ తరగని భక్తి విశ్వాసం
- నేటితో ముగియనున్న రొట్టెల పండుగ




స్వర్ణాల చెరువులో భక్తులు


మొక్కు తీర్చుకుంటూ..


మాకూ కోరికలున్నాయ్.. రొట్టెలు మార్చుకుంటున్న పోలీసులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 20 : నాల్గవ రోజు శనివారం కూడా చెరగని విశ్వాసంతో మదినిండా కోరికల రొట్టెల కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు చేసి వరాల రొట్టెలను పట్టుకున్నారు. అనంతరం బారాషహీదులను దర్శించుకున్నారు. కాగా, చెరువులో ఉద్యోగం, ప్రమోషన్ రొట్టెలకు డిమాండ్ పెరిగింది. ఆ రొట్టెల కోసం భక్తులు పలువురిని కోరడం జరిగింది.

భక్తిశ్రద్ధలతో తహలీల్‌ఫాతేహా

శనివారం మధ్యాహ్నం 1గంటకు బారాషహీద్‌లకు తహలీఫాతేహా భక్తిశ్రద్ధలతో జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన గంధమహోత్సవానికి ముగింపుగా శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. దర్గాలో గంధం చదివింపునకు ప్రత్యేక పూజలు, దువా నిర్వహించారు. అనంతరం బారాషహీద్‌లకు గంధం లేపనం చేసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సమీ హుసేనీ, షంషుద్దీన్, దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్‌ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడు న్యాయతుల్లా, ప్రధాన కార్యదర్శి కరిముల్లా, కార్యదర్శి మునీర్, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

దర్గా తాళం పగులగొట్టారు

శనివారం తెల్లవారుజామున దర్గా తలుపులు తెరవకపోవడంతో భక్తులు దర్శనం కోసం ఇబ్బందులు పడ్డారు. ముందు రోజు రాత్రి దర్గా మూసిన తర్వాత తాళాలను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ దగ్గర ఉంచుకుని తిరిగి తెల్లవారుజామున తెరవాలి. అయితే ఇన్‌స్పెక్టర్ దర్గా తాళాలను హుండీలు పాడుకున్న కాంట్రాక్టర్ మనిషికి ఇచ్చారు. ఆయన సమయానికి రాకపోవడంతో సయ్యద్‌సమీహుసేనీ దర్గా ఉత్సవ కమిటీ, పోలీసుల సమక్షంలో తాళాలు పగలగొట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఇది చర్చనీయాంశంగా మారింది. సాయంత్రం కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడు దినేష్‌రెడ్డి బారాషహీద్‌లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

సూపర్‌సిక్స్ రొట్టెలు అందుకున్న ఎమ్మెల్యే

రాష్ట్రం సుభిక్షంగా ఉండి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలని బారాషహీద్‌లను ప్రార్థించి స్వర్ణాల చెరువులో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూపర్ సిక్స్ (6 రొట్టెలు) రొట్టెలను పట్టుకున్నారు. తొలుత టీడీపీ నాయకులు భానుశ్రీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సయ్యద్ సమీహుసేనీ, కార్పొరేటర్లు తదితరులతో కలిసి ఆయన దర్గాలో పూజలు చేశారు. అనంతరం స్వర్ణాల చెరువులో ప్రత్యేక వేదికపై సూపర్‌సిక్స్ భారీ రొట్టెలను ఉంచి ప్రార్థనలు చేసి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రొట్టెలను పట్టుకున్నారు. అందులో తొలి ముక్కను తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి తినిపించారు. ఈ కార్యక్రమంలో దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్‌ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


బారాషహీద్ దర్గాలో భక్తజనం

నేటితో ముగింపు

ఆదివారం రాత్రి రొట్టెల పండుగ ముగుస్తుందని ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా తెలిపారు. ఈ పండుగ కోసం నెలరోజులుగా శ్రమించిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను, సిబ్బంది సేవలకుగాను సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కార్యాలయాల్లో కనీస వసతులు కరువు

వరికుంటపాడు, జూలై 20: మండలంలోని తహసీల్దారు, వ్యవసాయ, విద్యా వనరుల కేంద్రం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్, హౌసింగ్, వెలుగు, ఉపాధిహామీ, పీఆర్ కార్యాలయాలు నిత్యం ఉద్యోగులు, ప్రజలతో రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు కనీస వసతులకు నోచుకోవడం లేదు. గ్రామశివారులోని జాతీయ రహదారిని ఆనుకొని ఉండే ప్రధాన కార్యాలయాల్లో ఇతర వసతుల సంగతి అటుంచితే కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళల బాధలు వర్ణణాతీతంగా మారాయి. అత్యవసర సమయంలో చేసేదేమిలేక ఆరుబయటకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండటం తో వారి బాధలు వర్ణణీతీతంగా మారాయి. హౌసింగ్, వెలుగు కార్యాలయాల ఆవరణలో మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి. నీటివసతి కల్పించకపోవడంతో ఏళ్ల తరబడి వృథాగానే పడిఉన్నాయి. దీంతో అటువైపు చూసిన ప్రతి ఒక్కరూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండి పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


హౌసింగ్, వెలుగు కార్యాలయాల్లో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

మండలాభివృద్ధికి సహకరించండి : ఎంపీపీ

ఉదయగిరి, జూలై 20: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. శాఖలవారీగా అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడారు. శకునాలపల్లి, గన్నేపల్లి, పుల్లాయపల్లి, కొండాయపాళెం, అప్పసముద్రం, బండగానిపల్లి, దాసరిపల్లి పంచాయతీల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు బోర్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మండల సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి పాల్గొన్నారు.


ఎంపీడీవోను నిలదీస్తున్న నాయకులు

ప్రొటోకాల్‌పై ఎంపీడీవో నిలదీత

మండల సర్వసభ్య సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఫొటోలు లేకపోవడంపై టీడీపీ నాయకులు మట్ల రామయ్య, వెంకటేష్‌లు ఎంపీడీవో ఈశ్వరమ్మను నిలదీశారు. అధికారిక సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడం దారుణమని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాత ఫ్లెక్సీ ఉండడంతో ఏర్పాటు చేశామని, ఈసారి సమావేశానికి అలాంటి పొరపాటు జరుగకుండా చర్యలు చేపడతామని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ సమాధానమిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 20: దుత్తలూరు మెయిన్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

వరికుంటపాడు, జూలై 20: తోటలచెరువుపల్లి మొహర్రం వేడుకలు శనివారం ముగిశాయి. తెల్లవారుజామున భక్తులు అగ్ని గుండ ప్రవేశం చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. సాయంత్రం గ్రామోత్సవం అనంతరం పీర్లను బావి స్నానం చేయించి పీర్ల చావిడికి తరలించారు. ఈ సందర్భం గా స్థానికులతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. తిమ్మారెడ్డిపల్లిలోనూ వేడుకలు జరిగాయి.

దివ్యాంగులకు చేతి కర్రల పంపిణీ

అనంతసాగరం: స్థానిక పాత పోస్టాఫీసు వీధిలోని ఇద్దరు దివ్యాంగులకు శనివారం టీడీపీ మండల నాయకులు చేతికర్రలు పంపిణీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు వీటిని ఇచ్చామన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

ఆత్మకూరు, జూలై 20: పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హనుమాన్ భక్త బృందం, హిందూ చైతన్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం హనుమాన్ భక్త బృందం సభ్యులతో కలిసి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు పట్టణ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పాత సినిమా హాలు మీదుగా ఆర్టీసీ డిపో వరకు ఈ శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. శోభాయాత్రకు తరలివచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాట్లపై అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి చర్చించి సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో చెరువు తూము మరమ్మతులు


అనంతసాగరం చెరువు తూము వద్ద ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేస్తున్న కూలీలు

అనంతసాగరం, జూలై 20: స్థానిక చెరువు తూమునకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. చెరువు కింద 1000ఎకరాలకు పైగా ఇటీవల రైతులు వరిసాగు చేశారు. అయితే తూము షెట్టరు దిగక నీటి ఇబ్బందులతో రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో సాగు చేసిన వరికి నీరందక నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి సమస్యను మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి తక్షణ పనులకు అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో చెరువు వద్ద తూముకు అడ్డంగా ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేసి పనులు చేపడుతున్నారు. రెండురోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు తెలిపారు.

తూము షట్టర్ల పరిశీలన

ఉదయగిరి రూరల్: గండిపాళెం జలాశయం కుడి, ఎడమ తూముల షటర్లను శనివారం జలవనరుల శాఖ డీఈ కందుకూరు చంద్రమౌళి నిపుణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీకేజీ అవుతున్న వీటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఏఈలు సురేష్, వేణు పాల్గొన్నారు.


తూము షట్టర్లను పరిశీలిస్తున్న అధికారులు

స్తంభం కూలితేనే స్పందిస్తారా..?



ఉదయగిరి రూరల్, జూలై 20: స్థానిక నాగుల బావివీధిలోని విద్యుత్‌స్తంభం ఒరిగి ఎప్పుడు కూలుతుందో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభం మూలపై ఉండడం, ఎలాంటి సపోర్టు లేకపోవడంతో ప్రస్తుతం వీస్తున్న ఈదురుగాలుల వర్షానికి కూలిపోయే ప్రమాద ముందని చెబుతున్నారు. స్తంభం కూలి ప్రమాదం జరుగక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

నిత్యావసరాల ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

- తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయం

ఆత్మకూరు, జూలై 20: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సింహాద్రి మార్ట్ వద్ద ఏర్పాటు చేసిన నిత్యావసరాల ప్రత్యేక కౌంటర్‌ను శనివారం ఆర్డీవో మధులత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను అందించాలనే లక్ష్యంతో కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంది పప్పు కేజీ రూ.160, స్టీం రైస్ (బిపిటి రకం) కేజీ రూ.49, రా రైస్ కేజీ రూ.48లకు అందుబాటులో ఉంటాయన్నారు. కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దారు శివనాగిరెడ్డి పాల్గొన్నారు.


ఆత్మకూరులో కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో మధులత

భక్తిశ్రద్ధలతో సుల్తాన్ షాహిద్ గంధోత్సవం

ఆత్మకూరు, జూలై 20: పట్టణంలోని హజరత్ సుల్తాన్ వలియా దర్గా గంధోత్సవాన్ని శనివారం తెల్లవారుజామున నిర్వహించారు. ముందుగా నిర్వాహకులు గంధం కలశమును అశ్వంపై ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. స్వామి వారి సమాధికి గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు గంధం పంచిపెట్టి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్గా ఫకీరుల వాయిద్యాలు చేస్తూ ఆలపించిన గీతాలు అలరించాయి. .

చెన్నకేశవుడికి హనుమంతసేవ

సంగం, జూలై 20: మర్రిపాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి శుక్రవారం అర్ధరాత్రి హనుమంతుడి సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవ విగ్రహాన్ని గజమాలలతో అలంకరించి విద్యుత్ దీపాలంకరణలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

ఉదయగిరి రూరల్, జూలై 20: సున్నంవారిచింతల, ఉదయగిరి ప్రాథమిక పాఠశాలలో శనివారం జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వైద్యాధికారి దివ్య, గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన విద్యార్థులు, గ్రామస్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరైడ్ నీటిని తాగితే వచ్చే ఫ్లోరోసిస్ సమస్యలను వివరించారు. ఫ్లోరైడ్ కంటెంట్ అధికంగా ఉన్న టూత్‌పేస్ట్‌లను వాడరాదన్నారు. ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న వారు క్యాల్షియం, విటమిన్-సీ ఎక్కువగా ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న వారికి వాకర్స్, లాంబర్‌బెల్ట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మన్సూర్‌అలీ, అరుణ్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత బాధ్యతాయుతంగా మెలగాలి

ఉదయగిరి రూరల్, జూలై 20: పట్టణంలోని ప్రభుత్వ, మేకపాటి వెంకురెడ్డి, ప్రగతి జూనియర్ కళాశాలల్లో శనివారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక జీవనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ మాట్లాడారు. దేశాభివృద్ధిలో విద్యార్థులు, యువత పాత్ర కీలకమన్నారు. నేటియువత లక్ష్యర హిత జీవితం విధానంతో నైతిక పతనానికి లోనైందన్నారు. విలువైన సమయాన్ని మొబైల్ గేమింగ్, బెట్టింగ్, ధూమపానం, మద్యం, మాదకద్రవ్యాలకు డబ్బు వెచ్చిస్తూ మానసిక రుగ్మతలకు గురవు తున్నట్లు వాపోయారు. అలాంటి యువతలో బాధ్యతాయుత భావాన్ని కలుగజేసి సమాజంలో పేరుకు పోయిన చెడును నిర్మూలించేందుకు కృషి చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం గోడపత్రికలు విడు దల చేశారు. కార్యక్రమంలో ఎస్ఐవో జిల్లా ఆర్గనైజర్ అజరుల్లా, కార్యదర్శి షాహిద్, ముజిమిల్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆలయాల ముస్తాబు

ఆత్మకూరు, జూలై 20: మహిమలూరు, ఆత్మకూరులోని శివాలయం ప్రాంగణంలో వెలసిన షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ఉదయం 6గంటలకు స్వామికి కాగడ హారతి, అభిషేకం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, భజన సత్సంగం జరుగుతుందని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మహిమలూరు ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు దాతలు యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, మహిత దంపతులు తెలిపారు.

పారిశుధ్యానికే ప్రాధాన్యం

సీతారామపురం. జూలై 20: మండలకేంద్రంలోని నారాయణంపేట, పంద్రంగి ప్రాంతాల్లో శనివారం ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ పారిశుద్ధంపై ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమలు వృద్ధి చెందకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.


బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్

అభివృద్ధికి నోచని ఆంజనేయుడి ఆలయం

- వసతులు లేక భక్తుల ఇక్కట్లు

వలేటివారిపాలెం, జూలై 20 : గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ప్రసిద్ధి చెందిన ప్రసన్నాంజనేయుడి ఆలయానికి వచ్చే భక్తులకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆలయానికి ప్రతి ఆది, మంగళ, శనివారాల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కు తీర్చుకుంటుంటారు. ప్రతి ఏటా మే నెలలో హనుమజ్జయంతి సందర్భంగా గ్రామస్థులు వేడుకలు నిర్వహిస్తారు. అయితే ఈ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు షెడ్లు, స్నానాల గదులు, నీటివసతి, కూర్చోవడానికి నీడ, టాయ్‌లెట్లు, దారి సౌకర్యం లేదు. ఆలయం అభివృద్ధి చెందకపోవడానికి స్థల సమస్యే ప్రధాన కారణం. ఆలయం చుట్టూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సోదరుల భూములు ఉన్నాయి. ఆలయ అభివృద్ధికి దివి శివరాం ఎకరా స్థలం విరాళంగా ఇస్తానని గతంలో ప్రకటించారు. అయితే ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దాతలు ముందుకు రావడంలేదని గ్రామస్థులు తెలిపారు.


శిథిలావస్థలో ప్రసన్నాంజనేయుడి ఆలయం

సాయి మందిరాల్లో నేడు గురుపౌర్ణమి వేడుకలు

కావలి రూరల్, జూలై20: మండలంలోని తుమ్మలపెంట సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు సాయిబాబా ఆలయ ట్రస్ట్ చైర్మన్ అలహరి చిట్టిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, కాగడా హారతి, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుందన్నారు. తుమ్మలపెంట, అన్నగారిపాలెం గ్రామాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కావలిటౌన్ : గురుపూర్ణిమను పురస్కరించుకుని ముసునూరు శ్రీసాయిక్షేత్రంలో సాయినాథుడికి శనివారం లక్షమల్లెలార్చన నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, మంగళధ్వని, గోపూజ, తులసి పూజ, ధుని పూజ, అభిషేకం జరిగాయి. రాత్రి సామూహిక లక్షమల్లెలార్చన, పల్లకి సేవ నిర్వహించారు. ఆర్టీసీ డిపో వెనుకనున్న నందదీప్ సాయిసమాజ్, పాతూరు శివాలయం వద్దనున్న బాబా ఆలయాల్లో కూడా పూజలు జరిగాయి. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా పట్టణంలోని బాబా ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. అన్ని ఆలయాల్లో మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించనున్నారు.


కావలిటౌన్ : లక్షమల్లెలార్చనలో పాల్గొన్న భక్తులు


బిట్రగుంట: సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు


కలిగిరి : ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

బిట్రగుంట : బోగోలు మండలంలోని షిర్డీ సాయి మందిరాల్లో గురుపౌర్ణమి సందర్భంగా మందిర శుద్ధి పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. బోగోలు సాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో సాయి సేవకులతో పాటు ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకుమార్-సంధ్య దంపతులు పాల్గొన్నారు. విశ్వనాథరావుపేటలోని షిర్డీసాయి మందిరం విద్యుత్ దీపాలంకరణతో దగదగలాడింది. బిట్రగుంట ద్వారకానగర్ శేషసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, సాయినామ సంకీర్తన కార్యక్రమాలు వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆధ్వర్యంలో నిర్వహించారు.

కలిగిరి : స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో జరిగిన పాలభిషేకం, ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం అందరినీ అలరించింది. ఆదివారం స్వామివారి సర్వదర్శనంతోపాటు, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

25 నుంచి మంచినీటి పథకాలకు టెండర్లు

లింగసముద్రం, జూలై 20: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా ఏర్పాటైన భారీ మంచినీటి పథకాలు, ఉలవపాడు మండలం భీమవరం మంచినీటి పథకం నిర్వహణకు, ఆపరేషన్స్‌కు ఈనెల 25 నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ టెండర్లు ఆగస్టు 8వతేదీ సాయంత్రం 4.30 గంటల వరకు వేయవచ్చని తెలిపారు.అదేరోజు సాయంత్రం 5 గంటలకు టెండర్ల టెక్నికల్ బిడ్‌ను తెరుస్తారని, 9న ఫైనాన్షియల్ బిడ్‌ను తెరుస్తారని చెప్పారు.మండలంలోని ఇతర నీటి పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.10 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఇందులో 18 శాతం జీఎస్‌టీ పోను మిగిలిన మిగిలిన నిధులకు టెండర్లు పిలుస్తామని ఆయన వివరించారు.

ఆదరణ కేంద్రానికి మతిస్థిమితం లేని మహిళ

బిట్రగుంట, జూలై 20: బోగోలు మండలం ముంగమూరులోని ఆదరణ కేంద్రానికి శనివారం 50 ఏళ్ల అనాథ మతిస్థిమితం లేని మహిళను కొందరు తీసుకువచ్చి చేర్చారు. ఆదరణ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కే శ్రావణ్‌కుమార్ ఆమెకు నూతన వస్త్రాలు అందచేసి ఆహ్వానించారు. గుడ్లూరు మండల పరిధిలో రోడ్డుపై ఆ మహిళ తిరుగు తుండగా సామాజిక కర్తలు కొందరు గమనించి ఆదరణ కేంద్రానికి తీసుకువచ్చారని నిర్వాహకులు సింహాద్రి భవానీలు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో జేబీ విద్యార్థుల ప్రతిభ

కావలిటౌన్, జూలై2: డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో జేబీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వీఎస్‌యూ శనివారం విడుదల చేసిన ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థిని ఎస్‌కె షబీనా ఎమ్మెస్సీఎస్ గ్రూప్‌లో 9.83 గ్రేడ్ పాయింట్లు సాధించి టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ బీఏ కోర్సుల్లో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఎస్సీలోని ఫిజిక్స్, బాటనీ, జువాలజీలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని, బీఎస్సీ సీడీజెడ్ గ్రూప్‌లో పీ సురేంద్ర, ఎస్ దివ్య యూనివర్సిటీ ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి తదితరులు అభినందించారు.

మాలకొండ ఆదాయం రూ. 9,42,196

వలేటివారిపాలెం, జూలై 20 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,42,196 ఆదాయం వచ్చిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,350, కుంకుమార్చన ద్వారా రూ. 25,920, తలనీలాల ద్వారా రూ. 31,550, వాహనపూజల ద్వారా రూ. 4,400, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,63,000, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 740, రూములద్దెల ద్వారా రూ. 29,910, కవర్లు ద్వారా రూ. 4,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,78,785, అన్నదానం ద్వారా రూ. 4,78,225, విరాళాల ద్వారా రూ. 20,116 వచ్చిందన్నారు.

నేడు అభినందన సభ

కందుకూరు, జూలై 20: పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఆదివారం సాయంత్రం అభినందనసభ ఏర్పాటుచేసినట్లు సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీ గ్రంథాలయంలో సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభమవుతుందని, సాయంత్రం 3 గంటలకు పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ నుంచి గ్రంథాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్యులంతా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మహిళలకు సైకిల్ వీడర్ల పంపిణీ

కందుకూరు: స్థానిక ఎస్సీ మహిళలకు కేవీకే ఆధ్వర్యంలో సైకిల్‌వీడర్లు, టార్పాలిన్ పట్టలను శనివారం ఉచితంగా అందజేశారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి. ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ వివిధరకాల పంటలలో తక్కువ శ్రమతో కలుపు నిర్మూలనకు సైకిల్‌వీడర్లు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. సైకిల్ వీడర్లతో కలుపు నిర్మూలన చేసే పద్ధతిపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే కార్యక్ర మంలో కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన 17 గ్రామాలకు సురక్షిత తాగునీరు

అల్లూరు, జూలై 20: స్థానిక చెర్లో సంఘం వద్ద ఉన్న తాగునీటి పథకం మరమ్మతులను పూర్తిచేసి, త్వరితగతిన 17 గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలరావు అన్నారు. శనివారం ఆయన తాగునీటి పథకాన్ని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌తో కలసి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ తాగునీటి పథకం మరమ్మతులకు రూ.70 లక్షలు అవసరమవుతున్నాయన్నారు. జడ్పీ నిధుల కోసం నివేదిక పంపి, రాగానే మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. అల్లూరు మండల ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను బీద గిరిధర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రంగస్వామి,టీడీపీ నాయకులు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి పథకం వద్ద ఈఈ తిరుమలరావుకు పరిస్థితిని వివరిస్తున్న బీద గిరిధర్

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు పనులు

కావలి,జూలై20: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎట్టకేలకు అధికారులు లిఫ్ట్ మంజూరు చేశారు. బీజేపీతోపాటు పలు పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు లిఫ్ట్ అవసరాన్ని తెలియచేస్తూ రైల్వే అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందచేశారు. స్టేషన్‌ను ఆధునికీకరించినా లిఫ్ట్ ఏర్పాటు చేయకుండా వదిలివేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఒక ప్లాట్‌పాం నుంచి మరో ప్లాట్ ఫాం మీదకు మారాలంటే ఫుట్‌పాత్ వంతెన మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు లిఫ్ట్ మంజూరు చేశారు. దీంతో దాని నిర్మాణ పనులు చేపట్టారు.


రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ నిర్మాణానికి జరుగుతున్న పనులు

దొడ్డిదారిన చేర్చుకున్న మున్సిపల్ కార్మికులను తొలగించాలి

కావలి, జూలై20: స్థానిక పురపాలక సంఘంలో గత పాలకుల సిఫార్సులతో దొడ్డిదారిన ఆప్కాస్‌లో చేర్చుకున్న 27 మంది కార్మికులను తొలగించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లె అంకయ్య, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు యెల్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్ డిమాండ్ చేశారు. జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. వాస్తవంగా పదవీ విరమణ చేసిన, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, కొవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి డైలీ వేజస్ కింద పనిచేసిన కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే నేతల ఒత్తిడితో అక్రమంగా 27 మందిని చేర్చుకుని వారికి జీతాలు కూడా ఇస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆ వివరాలను అడిగితే వాస్తవాలు చెప్పకుండా అధికారులు దాస్తున్నారని పేర్కొన్నారు. వారిపై విచారణ జరిపి వెంటనే తొలగించాలన్నారు. లేకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తోందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు గుంజి కిషోర్, యెండ్లూరి రవి, గుంజి అంకయ్య, వై. ప్రభావతి, బందారు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

సత్యవోలులో డీఎల్‌పీవో విచారణ

కొండాపురం, జూలై20: మండలంలోని సత్యవోలు సర్పంచిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కందుకూరు డీఎల్‌పీవో శనివారం విచారణ నిర్వహించారు. సర్పంచు సాధారణ సమావేశాలను ఫోర్జరీ సంతకాలతో నిర్వహించడం, ఆరు నెలలకు ఒకసారి జరగాల్సిన పంచాయతీ సమావేశాన్ని నిర్వహించడంలేదంటూ సర్పంచి మాల్యాద్రిపై గ్రామానికి చెందిన ఉదయగిరి నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గడ్డె రామక్రిష్ణ, ఐటీడీపీ జిల్లా బిట్-2 అధ్యక్షుడు మందపల్లి మాధవరావులు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులను డీఎల్‌పీవో విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


వార్డు సభ్యులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో క్రిష్ణమోహన్

పొగాకు సాగు పరిమితి పెంపుపై హర్షం

వలేటివారిపాలెం, జూలై 20 : 2024-25 సీజన్‌కు పొగాకు సాగు పరిమితి పెంపునకు విశేష కృషి చేసిన పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఈడీ శ్రీధర్‌బాబుకు అభినందనలు తెలియజేస్తున్నట్లు మండల రైతు నాయకులు గుర్రం లక్ష్మీనరసింహం తెలిపారు. అంతేకాక పొగాకు సాగు పరిమితి పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తునట్లు ఆయన తెలిపారు.